J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 44 సంచిక : 41 14.03.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# చకచకా లెక్కలు తేలుస్తున్నారు!

## పగ, ప్రతీకారాలతో ప్రథమార్ధం - కేసులు, అరెస్టులు, జైళ్ళే పరమార్ధం





రాష్ట్రంలో రెడ్‌బుక్ - రెడ్డిబుక్ రాజ్యాంగం నడుస్తుందా.. లేదా? అన్న విషయం పక్కనపెడితే, లెక్కలు తేల్చే ప్రక్రియ మాత్రం మొదలైందని ఖచ్చితంగా చెప్పొచ్చు. ఓ వైపు 'జగన్ పాలనే మేలు' అన్నట్లుగా గత ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు అసంతృప్తితో ఉన్నారు. మరోవైపు కూటమి దూకుడు పెంచడం లేదని, ప్రత్యర్థుల భరతంపట్టడంలో మీనమేషాలు లెక్కపెడుతోందని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల శ్రేణులు నిరుత్సాహపడుతున్నారు. తమ కులానికి ప్రాధాన్యత కల్పించడంలేదని టీడీపీలోని కమ్మ తమ్ముళ్లు కూనిరాగాలు తీస్తున్నారు. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన ప్రథమార్ధంలో లెక్కలు తేల్చే పనికే బాబు ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. కేసులు, అరెస్టులు, జైళ్లే పరమార్ధంగా తొలి ఏడాదిన్నరని టార్గెట్‌గా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. క్రిందస్థాయి నాయకుడి దగ్గర నుండి బిగ్‌బాస్ వరకూ లెక్కలు తేల్చుకున్న తరువాతే పాలన, సంక్షేమం, అభివృద్ధి వంటి అంశాలపైన దృష్టి పెడతారని ఆ పార్టీల శ్రేణుల నుండే వినపడుతోంది. సినిమా ద్వితీయార్ధం బాగుంటేనే హిట్టవుతుందన్న పాలసీని చంద్రబాబు ఫాలో అవుతున్నాడని విశ్లేషకులు అంటున్నారు. లెక్కలన్నీ తేల్చేశాక చివరి మూడు సంవత్సరాలు బాబుమార్కు పాలన చూపిస్తారని చెప్తున్నారు.

## పాపాలే శాపాలై...
## కేసులుగా వెంటాడుతున్నాయి!

చిన్నాపెద్ద అనే తేడా లేదు. ఉచ్ఛంనీచం అంటే ఏంటో తెలియదు. తారతమ్యం చూడరు. ముందువెనకా ఆలోచించరు. ఏదిపడితే అది మాట్లాడడం, నోటికేదొస్తే అది అనేయడం, ఇదీ గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కొందరు సోషల్ సైకోలు, నాయకుల ప్రవర్తన. అబద్ధాలే పునాదులుగా, అరాచకాలే మార్గంగా అధికారమదంతో ఇష్టారాజ్యంగా కొందరు నేతలు రెచ్చిపోతే, మరికొందరు అక్రమాలు, ఆక్రమణలు, దౌర్జన్య దండకాలు తమ ఆశయం అన్నట్లుగా పదవులు వెలగబెట్టారు. ఫలితంగా వారంతా నేడు... పాపాలు పండి ఊచలు లెక్కపెట్టే

2లో

## విధేయతకి చోటు
## సమర్ధతకి సీటు



3లో

## 2వసారి ఎమ్మెల్సీగా బీద రవిచంద్ర



# అసాంఘిక శక్తుల ఆగడాలను అరికట్టండి

## పోలీసులకు 3 వాహనాలు.. 100 సీసీ కెమెరాలు అందించిన విపిఆర్



జిల్లాలో మహాదాతలుగా పేరొందిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి–ప్రశాంతిరెడ్డి దంపతులు తాము చేస్తున్న సామాజిక సేవలో భాగంగా జిల్లా పోలీసు యంత్రాంగానికి కూడా తమవంతు సహకారం అందించారు. విపిఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రా ఆధ్వర్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా జిల్లా పోలీసుశాఖకు 3 పోలీసు పెట్రోలింగ్ వాహనాలు, నేరాల నియంత్రణకు అవసరమయ్యే మరో 100 సిసి కెమెరాలను కూడా సమకూర్చారు. ఇటీవల కోవూరు పోలీస్ స్టేషన్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్, షటిల్‌కోర్టుల ప్రారంభోత్సవంలో వేమిరెడ్డి దంపతులు పాల్గొని, వాటిని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌కు అప్పగించారు. అంతే కాదు, శిథిలావస్థకు చేరిన కోవూరు పోలీసుస్టేషన్‌ను బాగుచేయిస్తామని, అందుకు సంబంధించిన నివేదికను సిద్ధం చేయాలని కూడా వారు ఎస్పీకి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో అరాచక శక్తులు రాజ్యమేలిన కోవూరులో అసాంఘిక శక్తుల ఆగడాలను అరికట్టాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌ని కోరారు. నేరాలు చేయాలంటేనే భయపడేలా రౌడీమూకలను ఉక్కుపాదంతో అణచివేసి కోవూరులో ప్రశాంతత నెలకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్కూళ్ళు, కాలేజీలు మరియు బస్‌స్టాండ్ల వద్ద నిఘా పెంచి, అసాంఘిక శక్తుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. అవినీతి రహిత, వివాద రహిత కోవూరు సాధన దిశగా పోలీసులు కృషి చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



# వెంకయ్య ఇంట్లో ప్రధాని మోడీ

భారత 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు – శ్రీమతి ఉషమ్మల మనుమడు (ఇమ్మణ్ణి వెంకట్రావు – శ్రీమతి దీపల కుమారుడు) **విష్ణు - సాత్వికల** పెళ్లి జనవరిలో జరిగింది. వారి వివాహ రిసెప్షన్ మార్చి 10వ తేదీ, సోమవారం సాయంత్రం ఢిల్లీలోని వెంకయ్య నివాసంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పాటు దాదాపుగా కేంద్ర క్యాబినెట్ మంత్రులు మొత్తం పాల్గొని కొత్త జంటని దీవించారు. వీరితో పాటు పలువురు అధికార అనధికార ప్రముఖులు హాజరై విష్ణు – సాత్వికలకి తమ ఆశీస్సులు అందించారు.

# చకచకా లెక్కలు తేలుస్తున్నారు!

(మొదటిపేజీ తరువాయి)

దుస్థితి నెలకొంది. దీంతో అరెస్టుల నుంచి తప్పించుకునేందుకు కొందరు క్షమాపణలు చెప్తుంటే, మరికొందరు ముందస్తు బెయిళ్ల కోసం కోర్టులను ఆశ్రయిస్తున్నారు. ఇంకొందరు ఇప్పటికే జైళ్లలో ఊచలు లెక్కపెడుతూ బెయిళ్ల కోసం పాకులాడుతున్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో తమ నాయకులను ముప్పుతిప్పలుపెట్టి, ముప్పై చెరువుల నీళ్లు తాగించిన ఇంకా కొందరి నాయకుల అరెస్టుల్లో తీవ్రమైన తాత్సారం జరుగుతూనే ఉందని, దీన్ని తామెంతమాత్రం సహించలేకపోతున్నామని తెలుగుదేశం పార్టీ కిందిస్థాయి నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రథమార్థం అరెస్టుల్లో మరింత జోరుపెంచి, ప్రత్యర్థి పార్టీకి చెందిన అక్రమార్కుల భరతం పట్టాలని, లేకుంటే ఊరుకునేదే లేదని తెల్చి చెప్తున్నారు.

### గత ఐదేళ్లూ బండబూతులు.. వెకిలి చేష్టలు...!

2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకుని కొందరు నాయకులు మైకాసురుల్లై రెచ్చిపోయారు. ముఖ్యంగా తెలుగుదేశం అధినేత చంద్రబాబు, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్‌లను తిట్టినతిట్టు తిట్టకుండా తిట్టి తమ వాచాలత్వాన్ని బయటపెట్టుకున్నారు. ఈక్రమంలో చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మొదలు, పవన్ కల్యాణ్, ఆయన కుటుంబ సభ్యులు, ఇతర నాయకుల వ్యక్తిగత విషయాలపై బహిరంగంగా, బరితెగించి మైకుల ముందు ప్రకటనలతో విరుచుకుపడ్డారు. అంతేకాక, తమ మాట వినని ప్రత్యర్థి పార్టీల నాయకులను, ప్రభుత్వానికి వ్యతిరేకంగా అభిప్రాయాలు చెప్పిన సాధారణ ప్రజలు, టీడీపీ, జనసేన కార్యకర్తలను, సోషల్ మీడియా కార్యకర్తలను వెంటాడి వెంటాడి మరీ వేధించారు. చివరికి తెలుగుదేశం అధినేత చంద్రబాబుని సైతం స్కిల్ స్కాం పేరుతో అరెస్టు చేశారు. ఇది దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

### కబ్జాలకి, స్కాములకి శ్రీకారం...!

ఇక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని కొందరు నాయకులు కోటానుకోట్లు కొట్టేశారనే వాదనలున్నాయి. ముఖ్యంగా విజయసాయిరెడ్డి విశాఖలో అనేక భూ కబ్జాలకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. కాకినాడ పోర్టులో వాటాల వ్యవహారంలో అవినీతికి పాల్పడ్డారంటూ సిబిఐ, ఈడీ కేసులు కూడా నమోదయ్యాయి. ఇక వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నంబర్–2గా చెలామణి అయిన అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దాదాపు 1000 ఎకరాలకు సంబంధించిన అటవీ భూములు, అసైన్డ్ ల్యాండ్స్‌ను ఆక్రమించారని, నిబంధనలకు తిలోదకాలిస్తూ అడ్డగోలు పంచాయితీలతో భూకబ్జాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లవెత్తాయి. అధికారం కోల్పోయిన తర్వాత కూడా తన అక్రమాలు వెలుగులోకి రాకుండా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలోని పత్రాలను ఉద్దేశపూర్వకంగా దగ్ధం చేయించారనే విమర్శలు వినిపించాయి. అలాగే ఆయన కుమారుడు ఎంపీ మిథున్‌రెడ్డి ఢిల్లీ స్థాయిలో కాంట్రాక్టులను దక్కించుకోవడం కోసం అనేక అడ్డదారులు తొక్కారని, నిబంధలను అతిక్రమించారని, ముఖ్యంగా ఏపీలో కల్తీమద్యం, నాసిరకం మద్యం బ్రాండ్ల విక్రయంలో కీలకపాత్ర వహించారని ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోశాయి. ఇక సకలశాఖా మంత్రిగా అడ్డగోలు వ్యవహారాలకు అన్నీ తానై వ్యవహరించిన సజ్జల రామకృష్ణారెడ్డి భూకబ్జాలు, సెటిల్‌మెంట్‌లకు కేంద్ర బిందువయ్యారనే ఆరోపణలున్నాయి. అలాగే జగనన్న కాలనీలకు సంబంధించిన భూముల కొనుగోళ్లు, అమ్మకాల్లో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై ఆరోపణలున్నాయి. ఇక ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం పేరుతో, వందలాది కోట్లు దోచేశారనే విమర్శలను అప్పటి మంత్రి ఆర్కే రోజా, అప్పటి శాప్ ఛైర్మెన్ బైరెడ్డి సిద్ధార్థ్ మూటకట్టుకున్నారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం వచ్చాక పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అనేక కేసులు నమోదు చేసింది. అలాగే ఆయన ఆక్రమించిన భూములకు సంబంధించి సమగ్ర దర్యాప్తునకు ఆదేశించింది. ఇక ఆడుదాం ఆంధ్రా, సీఎం కప్ పేరుతో క్రీడాశాఖ నిధులను పక్కదారి పట్టించిన వ్యవహారంపై తాజాగా అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) దృష్టిసారించింది. దీంతో త్వరలోనే రోజా, బైరెడ్డి తదితర నాయకుల అరెస్టు కూడా ఉంటుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇక తిరుమల లడ్డూ తయారీలో కల్తీనెయ్యి వినియోగానికి సంబంధించిన విషయంపై అప్పటి తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్లు, బోర్డు సభ్యులు, అధికారుల అక్రమాలపై ఇప్పటికే సిట్ తన దర్యాప్తును ప్రారంభించిన విషయం తెలిసిందే. అలాగే రాజకీయ సన్యాసం పేరుతో ఎంపీ పదవికి రాజీనామా చేసిన విజయసాయిరెడ్డి పనిపట్టేందుకు కూడా పక్కా స్కెచ్ రెడీ అవుతున్నట్లు సమాచారం. ఆయన్ని ఉపేక్షిస్తే పాముకు పాలుపోసినట్టే అనే వాదనలు వినిపిస్తున్నాయి.

### వీధిరౌడీల తరహాలో దాడులు!

కొందరు వైఎస్సార్‌సీపీ నాయకులు అధికారాన్ని అడ్డంపెట్టుకుని అడ్డూఅదుపు లేకుండా ప్రవర్తించారనే ఆరోపణలున్నాయి. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చంద్రబాబు, లోకేష్, భువనేశ్వరిలపై దారుణమైన వ్యాఖ్యలు చేశారనే విమర్శలున్నాయి. అలాగే కొడాలి నాని, పేర్నినాని బూతులతో రెచ్చిపోవడం తెలిసిందే. వీరిలో వల్లభనేని వంశీ ఓ కిడ్నాప్ కేసులో అరెస్టయ్యి ప్రస్తుతం రిమాండ్ జీవితం గడుపుతున్నారు. త్వరలోనే కొడాలి నాని, పేర్ని నానిపై కూడా చర్యలుంటాయనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇక బోరుగడ్డ అనిల్ సోషల్ మీడియాలో ఓ వర్గాన్ని టార్గెట్ చేసుకుని వీధిరౌడీలా రెచ్చిపోయారన్నది బహిరంగ రహస్యమే. దీంతో కూటమి ప్రభుత్వం ఆయన్ని అరెస్టుచేసి కటకటాల్లోకి నెట్టింది. అయితే తన తల్లికి అనారోగ్యం పేరుతో మధ్యంతర బెయిల్ పొందేందుకు తప్పుడు సర్టిఫికెట్లను కోర్టుకు సమర్పించారనే ఆరోపణలు వెల్లువెత్తడంతో తొలుత అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడనే ఆరోపణలు వచ్చాయి. చివరికి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఆయన లొంగిపోయాడు. అయితే తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో మధ్యంతర బెయిల్ పొందడం పోలీసుశాఖతో పాటూ న్యాయశాఖను కూడా అవాక్కయ్యేలా చేసింది. ఈ ఉదంతంతో ఆయనపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం కూడా లేకపోలేదు. ఇక మీడియాలో పవన్ కళ్యాణ్‌పై రెచ్చిపోయిన నటుడు పోసాని కృష్ణమురళిపై సైతం రాష్ట్రవ్యాప్తంగా అనేక కేసులు నమోదయ్యాయి. దీంతో ఆయన అరెస్టై బెయిల్ కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఇక వ్యూహం సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లను తూలనాడిన కేసులో సినీ దర్శకుడు ఆర్జీవీ పోలీసు విచారణను ఎదుర్కొంటున్నారు. అలాగే పోక్సో కేసులో బాధితురాలి పేరు బహిరంగంగా వెల్లడించారనే కేసులో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై సైబర్ క్రైం దర్యాప్తు సాగుతోంది. ఇక అన్నింటికంటే ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి, ధ్వంసం కేసు సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ కేసులో మాజీ ఎంపీ నందిగం సురేష్, మాజీ మంత్రి జోగి రమేష్, లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాష్ సహా మరో 14 మందిపై కేసులు నమోదైన విషయం విదితమే. వీరిలో నందిగం సురేష్ జైలుకెళ్లొచ్చారు కూడా. ఇక జోగి రమేష్ ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. అయితే ఆయన తనయుడు జోగి రాజీవ్ మాత్రం అగ్రిగోల్డ్ భూముల లావాదేవీల్లో అక్రమాలకు పాల్పడిన కేసులో జైలు ఊచలు లెక్కబెట్టిన విషయం తెలిసిందే.

### ముందు నాయకులు... ఆ తర్వాత పెద్ద చేప..!

అలాగే వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పేరుతో చంద్రబాబుపై దూషణలకు పాల్పడిన నాగార్జున యాదవ్‌ను కుప్పం పోలీసులు గతంలో అరెస్టు చేశారు. ఇక సోషల్ మీడియాలో అడ్డదిడ్డంగా వాగే శ్రీరెడ్డి, పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన యాంకర్ శ్యామల వంటి వారు తమ మాటలకు సంబంధించి పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ క్షమాపణ కూడా చెప్పారు. అయితే వీరిని కూడా ఉపేక్షించే పరిస్థితి ఉండదని సమాచారం. ఇక వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జిగా పక్కా సైకోల బ్యాచ్‌ని మెయిన్‌టైన్ చేశారనే ఆరోపణలున్న సజ్జల భార్గవ్‌రెడ్డి కూడా కటకటాల పాలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆ తర్వాత వరుసగా ఎమ్మెల్సీ దువ్వాడ, రైస్ మిల్లుల బాస్ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, కోడిగుడ్డు మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథరెడ్డి, కోర్టులో ఫైళ్ల మాయం ఆరోపణలు ఎదుర్కొన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఒక పర్సెంటా..అరపర్సెంటా.. అంటూ రెచ్చిపోయిన అనిల్ కుమార్‌యాదవ్ సహా కోటరీ నాయకులు, చివరాఖరన పెద్ద చేప వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వంతు వస్తుందని టీడీపీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఇటీవల ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇతర వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చే పేరుతో తెలుగుదేశం పార్టీకి అండగా ఉండే ప్రధాన కులాన్ని పక్కనబెట్టారని, ఇది ఎంత మాత్రం సమంజసం కాదని ఇప్పటికే టీడీపీ సానుభూతిపరులు, కార్యకర్తలు సోషల్ మీడియాలో అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. ఇలాంటి సమయంలో వైఎస్సార్‌సీపీ నాయకుల అరెస్టుల విషయంలో కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తే టీడీపీ, జనసేన కిందిస్థాయి నాయకులు, సోషల్ మీడియా యాక్టివిస్టులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోయే పరిస్థితి ఉంటుందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

గొప్ప రాజనీతిజ్ఞతతో ఏ విషయాన్నీ ముప్పుగా మారేవరకు తెచ్చుకోని నైజం చంద్రబాబుది. రాజకీయ చతురత, చాణుక్యత ప్రదర్శించడంలో ఆయనకి ఆయనే సాటి. ఈ క్రమంలో కార్యకర్తలు, నాయకుల మనోభావాలకు ఆయన ప్రాధాన్యత ఇస్తున్నారన్న వాదన కూడా వినిపిస్తోంది. వైఎస్సార్‌సీపీ హయాంలో రెచ్చిపోయిన నాయకులకు ఆయన తగిన గుణపాఠం చెబుతారని, కూటమి పాలన ఏడాదిన్నర కాలం పూర్తి చేసుకునేలోపే ఏ1 జగన్‌పై కూడా చర్యలు తీసుకోవడానికి పక్కా ప్రణాళికతో ముందుకుసాగే అవకాశం ఉందన్నది విశ్లేషకుల అభిప్రాయం. ద్వితీయార్థంలో చివరి మూడేళ్లు పూర్తిస్థాయిలో సంక్షేమ కార్యక్రమాల అమలుపై దృష్టిసారించి 2029 ఎన్నికలకు సిద్ధమవుతారని మేధావులు అంచనా వేస్తున్నారు. ఏదేమైనా ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పాలన పడకేసి కేసులు, అరెస్టులు, జైళ్ళు, బెయిళ్ళ కాలం నడుస్తోందంటే అతిశయోక్తి కాదేమో..!

## విపిఆర్ చేయూతతో..

# దివ్యాంగుల కళ్లల్లో సంతోషం

### 150 మందికి ట్రై సైకిళ్ళు

తమ దయార్ద్రహృదయంతో వేమిరెడ్డి దంపతులు దీనజనుల సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. విపిఆర్ ఫౌండేషన్ ఏర్పాటుచేసి ఎందరో పేదలు, అసహాయులకీ సేవలందిస్తున్నారు. అందులో భాగంగా ఇటీవల కందుకూరు నియోజకవర్గంలోని గుడ్లూరులో జరిగిన కార్యక్రమంలో స్వయంగా విపిఆర్ పాల్గొని, నడవలేక బాధలుపడుతున్న అనేకమంది దివ్యాంగులకు విద్యుత్ ట్రైసైకిళ్ళను అందజేయడంతో, వారి కళ్లల్లో ఆనందం తొణికిసలాడింది. కందుకూరు నియోజకవర్గంలోని 150 మంది దివ్యాంగులకు వాటిని అందజేశారు. ట్రై సైకిళ్లను అందించేందుకు ప్రతి ఒక్కరి వద్దకు వెళ్ళిన ఎంపీ వేమిరెడ్డి.. వారి బాగోగులు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ట్రై సైకిళ్లు ఎలా నడపాలో వారికి ఆయన వివరించారు. దివ్యాంగుల సంతోషాన్ని ఆయన ప్రత్యక్షంగా చూసి మురిసిపోయారు. వేమిరెడ్డికి ఈ సందర్భంగా దివ్యాంగులు తమ ఆశీస్సులందించారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం తదితరులు పాల్గొన్నారు.

విపిఆర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలో భాగంగా అనేక గ్రామాలు తిరిగామని, ఆ సమయంలో దివ్యాంగుల అవస్థలను ప్రత్యక్షంగా చూశామని, వారికి ట్రైసైకిళ్లు అందించాలని అప్పుడే నిర్ణయించుకున్నామని చెప్పారు. ప్రత్యేక బృందం ద్వారా అన్ని నియోజకవర్గాల్లో సర్వే చేయిస్తూ అర్హులైన వారికి ట్రై సైకిళ్లు అందిస్తున్నామన్నారు. అనంతరం వేమిరెడ్డి సేవలను స్థానిక నాయకులు, దివ్యాంగులు కొనియాడారు.



## విధేయతకి చోటు - సమర్థతకి సీటు

# 2వసారి ఎమ్మెల్సీగా.. బీద రవిచంద్ర



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకుడు, ఆ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి బీద రవిచంద్రకు రెండవసారి శాసనమండలి పదవితో ఆ పార్టీ పట్టం కట్టింది.

క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా, విధేయత కలిగిన నాయకుడిగా తెలుగుదేశం పార్టీలో గుర్తింపు కలిగిన యువనేత బీద రవిచంద్ర. ఆయన తెలుగు దేశం పార్టీ జెండా తన భుజానికి ఎత్తుకున్నప్పటి నుండి ఈనాటివరకూ ఎప్పుడూ జెండా దించలేదు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కూడా ఆయన పక్కచూపులు చూడలేదు. తన రాజకీయ గురువులు, సొంతం అనుకున్నవారు పార్టీలు మారినా, తాను మాత్రం టీడీపీ నీడనే నమ్ముకున్నాడు. జిల్లా స్థాయిలో పార్టీ సమన్వయ బాధ్యతలు అప్పచెప్పినా, రాష్ట్ర స్థాయిలో తెలుగు యువత అధ్యక్ష పదవి కట్టబెట్టినా.. ప్రతిచోటా అంకితభావంతో పనిచేశాడన్న మంచిపేరునే తెచ్చుకున్నారాయన. ఎన్నికల ఇన్‌ఛార్జిగా, జిల్లాల, నియోజకవర్గాల పరిశీలకుడిగా పార్టీ ఎక్కడికి వెళ్ళమంటే అక్కడకి మారు మాట్లాడకుండా వెళ్ళేవాడు. పార్టీ అప్పజెప్పిన బాధ్యతని సమర్థవంతంగా పూర్తి చేయడంలో తనదైన ముద్రని వేసుకునేవాడు. చిన్నా పెద్దా అన్న తేడా లేకుండా అందరితో కలిసిపోతాడు. రాముడికి లక్ష్మణుడిలా తన సోదరుడు బీద మస్తాన్‌రావు కోసం కష్టపడేవాడు. నమ్మకం కలిగిన నాయకుడిగా పార్టీలో గుర్తింపు తెచ్చుకున్నాడు.

పార్టీ ఆయన విధేయతని గమనించింది, సమర్థతని గౌరవించింది, కష్టాన్ని గుర్తించింది, రెండవసారి శాసనమండలి సభ్యత్వంతో సత్కరించింది. రవిచంద్రకి 'లాయర్' అభినందనలు!

# మహిళా శక్తికి ప్రతీకగా.. శ్రీసిటీ



వివిధ రంగాల్లో మహిళల ప్రాధాన్యతను గుర్తిస్తూ శ్రీసిటీ, స్థానిక పరిశ్రమల వారు ఇటీవల అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. షార్ మహిళా శాస్త్రవేత్తలు, శ్రీసిటీలోని మహిళా ఉద్యోగులు ఈ వేడుకలలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ, శ్రీసిటీలోని మహిళా శ్రామికశక్తి సమాన అవకాశాలతో ప్రగతి దిశగా పయనిస్తోండడం విశేషమని అన్నారు. శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో నిర్వహించిన ఈ వేడుకలను శ్రీమతి మమతా సన్నారెడ్డి, తిరుపతి ఏఎస్పీ బిహెచ్ విమలకుమారి, సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం.. షార్ సీనియర్ సైంటిస్ట్ వి.లత ప్రారంభించారు. శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీ విజయంలో మహిళా ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమన్నారు. సమ్మిళిత, వివక్షత లేని, ఉద్యోగ కేంద్రీకృత విధానాలు కలిగిన శ్రీసిటీ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ, మహిళలకు అనుకూల మరియు ప్రగతిశీల పని వాతావరణాన్ని పెంపొందించిందని ఆమె తెలిపారు. మహిళా ఉద్యోగులను ఉద్దేశించి విమలకుమారి, లత, మమతా సన్నారెడ్డి ప్రసంగిస్తూ, ఇటీవలి కాలంలో వివిధ రంగాలలో స్త్రీల పాత్ర, ప్రభావం పెరుగుతున్నాయని, శ్రామికశక్తిలో మహిళలు కీలకపాత్రను పోషిస్తున్నారని అన్నారు.

# కోవూరులో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుచేయండి

## - చేనేతకారుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించిన ప్రశాంతమ్మ -

చేనేతకారుల అభ్యున్నతి కోసం కోవూరు ప్రాంతంలో టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటుచేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు.

ఇటీవల ఆమె అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతూ, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గంలోని పాటూరులో ఉన్న చేనేతకారుల పరిస్థితులను వివరించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యపు విధానాలతో పాటూరు చేనేతకారులు ఎంతో నష్టపోయారన్నారు. మళ్ళీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, చేనేతకారుల్లో ఆశలు చిగురించాయన్నారు. చేనేత రంగంలో అత్యాధునిక డిజైన్లకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని, కోవూరు ప్రాంతంలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని ఆమె విజ్ఞప్తిచేశారు. చేనేత కార్మికుల కోసం నిర్మించ తలపెట్టిన చేనేత భవనానికి సంబంధించిన స్థలం ఆక్రమణకు గురైవుందని, దాన్ని అక్రమార్కుల చెర నుంచి విడిపించి కోవూరు నియోజకవర్గంలో చేనేత భవనం నిర్మించాలని ఆమె కోరారు. మంగళగిరిలో చేనేతల సంక్షేమం కోసం చేపట్టిన వినూత్న పథకాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరింప చేయాలని కోరారు.



# కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవాలి

- **అపోలో వైద్యుల సూచన**



ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని... ముఖ్యంగా కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవాలని నెల్లూరు అపోలో వైద్యులు సూచిస్తున్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా ఈనెల13న అపోలో ఆసుపత్రిలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆ ఆసుపత్రి డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్‌సతీష్, నెఫ్రాలజీ వైద్య నిపుణులు డాక్టర్ ఏకే చక్రవర్తి, డా.బి.మస్తాన్‌వలీ మాట్లాడుతూ, కిడ్నీలకి సమస్య ఉన్నట్లు అనిపిస్తే, వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. షుగర్, అధిక రక్తపోటు, ఊబకాయం సమస్యలతో బాధపడేవారికి కిడ్నీ సమస్యలు అధికంగా వస్తుంటాయన్నారు. పరిశుభ్రమైన మంచినీళ్లు తాగుతుండడం వల్ల కిడ్నీ సమస్యలకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో 100కి పైగా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించామని, వారంతా పూర్తి ఆరోగ్యంగా జీవిస్తున్నారని తెలిపారు. ఆసుపత్రి యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.




లాయర్
మార్చి 14, 2025

# వేసవి కాలం.. తల్లితండ్రులకు 'పరీక్షా' కాలం!

ఔను!.. వేసవి కాలం వస్తే.. తల్లితండ్రులకు పరీక్షాకాలం వచ్చేసినట్లే. సహజంగా మార్చినెలలో విద్యార్థులకు పరీక్షలు జరుగుతుంటాయి. అవి అయిపోయాక, దాదాపు రెండునెలల పాటు వేసవి సెలవులుంటాయి. టెన్త్, ఇంటర్ విద్యార్థులు తమ పరీక్షా కాలం దాటుకుని, హాయిగా ఆటపాటలు, విహారాలతో గడుపుతుంటారు. చిన్నతరగతుల వారికి కూడా సెలవులే. సరిగ్గా ఈ సమయమే తల్లితండ్రులకు పరీక్షా కాలంగా ఉంటుంది. ఎందుకంటే, మగపిల్లలు ఒక పట్టాన ఇంట్లో ఉండరు. వాళ్లు కాసేపు కనిపించకపోతే ఎటు వెళ్లారో... ఏమైపోయారోనని తల్లితండ్రులు ఆరాటపడిపోతుంటారు. వేసవి సెలవులు.. ప్రమాదాలకి నెలవులుగా మారిపోతుండడమే అందుకు ప్రధాన కారణం. ప్రతి ఏటా వేసవి సెలవుల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి విద్యార్థులు తరచూ ప్రమాదాల బారిన పడుతూ ఉంటారు. ఇంట్లో ఉన్నట్లే ఉంటారు కానీ, అటు తిరిగి ఇటు చూసేసరికి కనిపించరు. వెతుక్కుంటూ వెళ్తే..ఏ చెరువు కాడో, బావికాడో కనిపిస్తారు. బొత్తిగా భయం భక్తీ లేకుండా, కనీసం ఈత కూడా రాకుండా నీటిగుంటల్లోకి దూకేస్తుంటారు. ఆకతాయిలు నలుగురు కలిస్తే చాలు..తిరుగుళ్ళకి డబ్బులు కూడా పెద్దలను మాయచేసి ఎలాగో తెచ్చేసుకుంటారు. ఇక వాళ్లని పట్టలేం. అట్లని వాళ్లని ఏమీ అనలేం కూడా. మన బలహీనత..పిల్లల పాలిట ఒక్కోసారి ప్రమాదకరంగా కూడా మారుతుంది. ఎక్కడెక్కడో తిరగాలని, కొండలు గుట్టలు అన్నిట్నీ ఎక్కేయాలని, జలపాతాలని చూడాలని ఇలాంటి కోరికలు వారికి కొల్లలుగానే ఉంటుంటాయి. అయితే, పెద్దలకు చెప్పకుండా ఎక్కడికంటే అక్కడికి వెళ్లిపోతే మాత్రం ప్రమాదమని వారికి తెలియజెప్తుండాలి. అంతేకాదు ప్రతి నిమిషం ఏమరుపాటు లేకుండా కనిపెట్టుకుని ఉండాల్సిందే తప్ప మరో మార్గం లేదు. అసలే, మన కాలువలు, చెరువులు అన్నీ ఎక్కడంటే అక్కడ ఇసుక కోసం, మట్టికోసం లోడేసి వుంటారు. నీళ్ళొచ్చాక ఆ గుంటలు కనిపించవు. గట్టుమీద నుంచి రెండడుగులు వేయగానే, అవి లాగేసుకుంటుంటాయి. అంతే, ఇక ఆతర్వాత చెప్పడానికి, వినడానికీ ఏమీ ఉండదు. ఎండాకాలంలో ఈత వచ్చిన పల్లెటూరి పిలగాళ్ళకి లోతైన బావుల్లోకి ఎగిరి దూకడమంటే భలేగా ఉంటుంది. కానీ, ప్రమాదం ఎప్పుడు ఏరూపంలో ముంచుకొస్తుందో తెలియదు కదా!.. అందువల్ల ఎక్కడైనా సరే, ప్రమాదాలు జరుగుతాయనుకున్న ప్రాంతాల్లో ఆయా గ్రామాల్లో నీటిగుంటలు, కాలువలు, నదులు, చెరువుల వద్ద 'ఇక్కడ దిగితే..ప్రమాదకరం' అని హెచ్చరిక బోర్డులు పెట్టాలి. ఎవరూ ఆ ప్రమాదస్థలాల వద్దకు పోగూడదని పదేపదే దండోరా వేయిస్తుండాలి. పిల్లలు కదా!..ఒక్కోరికి ఒక్కో రకమైన సరదా ఉంటుంది. కొంతమంది పిల్లలకు చెట్లెక్కడమంటే భలే ఇష్టం. ఇంట్లో చెప్పకుండా.. ఏ తోటల్లోకో, లేదా అటవీ ప్రాంతాల్లోకో వెళ్లేవారూ లేకపోలేదు. అయితే, అక్కడ ఏ కొమ్మో విరిగి, వారికేదైనా ప్రమాదం జరిగితే..వారు అక్కడ ఆ ప్రమాదంలో ఉన్నట్లు మనకెలా తెలుస్తుంది?..అంతా తెలిసేసరికి..జరగకూడని ఘోరమేమైనా జరిగితే?.. అందువల్ల పిల్లలను ఎప్పుడూ నిర్లక్ష్యంగా వదిలేయకూడదు. సముద్ర స్నానాలకు వెళ్లడమంటే ఇష్టపడే విద్యార్థులు ఎందరో ఉంటారు. అయితే, ఎప్పుడు ఎలాంటి అల వస్తుందో వారికి మాత్రం ఎలా తెలుస్తుంది?..అందువల్ల సముద్ర తీరప్రాంతాల్లో గస్తీని ముమ్మరంగా ఏర్పాటుచేయాలి. ఇంకొంతమంది యువకులు మిట్టమధ్యాహ్నం మిడిమేళపు ఎండలో కూడా ఆటల్లో మునిగిపోతుంటారు. ఎండబెట్ట తగిలి ఏమైనా అయితే?..అంటే, 'సెలవుల్లో కూడా మమ్మల్ని వదలరా'..అంటూ అమ్మానాన్నల మీద కోపగించుకుంటూ ఉంటారు. ఈ ఆధునిక కాలంలో పట్టణాలు, నగరాలకు చెందిన యువకుల మనస్తత్వం మరో విధంగా ఉంటుంది. సెల్‌ఫోన్‌లు వచ్చాక తలపోటు వచ్చినా సరే, దానిని వదలడం లేదు. కనుక, ఆ విషయంలో తల్లి తండ్రులు అప్రమత్తంగా ఉండాలి. మారాం చేసేవాళ్ళని గారాం చేసి.. వాళ్లు చెప్పినట్లు మనం కూడా వింటే మాత్రం.. ఆ తర్వాత జరిగేవాటికి విచారించి ప్రయోజనం ఉండదు. షోగ్గా సెల్‌ఫోన్ చేతపట్టుకుని ఎక్కడంటే అక్కడ తిరగడం మంచిది కాదు. వాళ్లు ఎక్కడికైనా సరదాగా వెళ్ళాలనుకుంటే వారికి తోడుగా మనమే వెళ్ళాలి. లేదా, వారికి ఎవరో ఒకరు పెద్దవాళ్లు తోడుండేలా చూసుకోవాలి. అయినా, పిల్లలతో ప్రేమగా మాట్లాడుతూ వారి అభిప్రాయాలను తెలుసుకుని, వారికి ఏది మంచో.. ఏది చెడో తెలియజెప్పడానికి ఈ సెలవుల కన్నా మంచి సమయం ఇంకోటుండదు. అలా సెలవులను సద్వినియోగం చేసుకోవచ్చు కూడా. ఈ వేసవి సెలవులను పిల్లలతో అలా హాయిగా గడిపితే ఉభయకుశలోపరి అన్నట్లు పెద్దలకు, పిల్లలకు మరింత శ్రేయస్కరం!..ఏమంటారు?..

## పోటీతత్వంతో హద్దు మీరుతున్న మీడియా!

ఓ వైపు సామాజిక మాధ్యమాలు, మరోవైపు ఎలక్ట్రానిక్ మీడియా, ఇంకో వైపు వార్తా పత్రికలూ... ఇవన్నీ పోటీతత్వంతో అత్యుత్సాహంగా వ్యవహరిస్తున్నాయి. తమ పరిధిని దాటి హద్దుమీరి ప్రవర్తిస్తున్నాయి. ఒకరికంటే ముందు ఒకరు వార్తలు అందించాలనే తాపత్రయంతో తొందర పడుతున్నాయి. తప్పుడు సమాచారంతో సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాయి. తాజాగా సింగర్ కల్పన విషయంలో ఈ మూడు విభాగాలు చేసిన అనవసరపు రాద్ధాంతం, అబద్ధపు ప్రచారమే అందుకు పెద్ద ఉదాహరణ. వీళ్ళు చేసిన రచ్చతో ఆమె కుటుంబం మొత్తం క్షోభను అనుభవించారు. తాను తరచూ మింగే నిద్ర మాత్రల మోతాదు కొంచెం ఎక్కువై కల్పన అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. తాను కోలుకున్న తరువాత ఆమే స్వయంగా ఈ విషయం ప్రకటించింది. అంతలోపే మన సామాజిక, మీడియా సైన్యం ఆమెది ఆత్మహత్యా ప్రయత్నంగా వార్తలు వండి వడ్డించారు. ఆమె భర్త లేదా కుమార్తె ఇద్దరిలో ఎవరో ఒకరు అందుకు కారణమంటూ ఈ జ్ఞానులే తేల్చేశారు. ఇలా దుర్మార్గపు రాతలతో తమ సామాజిక మాధ్యమాల ప్రాధాన్యతని, ఛానెళ్ళ టీఆర్పీలని, పత్రికల పాఠకులని పెంచుకొనే ప్రయత్నం చేస్తున్నవారికి కఠిన శిక్షలు పడేలా చట్టాలు రూపొందిస్తే తప్ప ఈ ప్రబుద్ధులు మారరేమో!

లక్ష్మీ భరద్వాజ్ - హైదరాబాదు.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

## వివాదాలకి వేదికలవుతున్న విశ్వవిద్యాలయాలు!

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు వివాదాలకి వేదికలవుతున్నాయి. యూనివర్సిటీల ఉపకులపతి (వైస్ ఛాన్సలర్)ల నియామకాలు వివాదాస్పదమవుతున్నాయి. వీసీల నియామకంలో అధికారపార్టీ నేతల జోక్యంతో వారి నియామకాలకు రాజకీయ రంగు పులుముకుంటోంది. ఏ పార్టీ అధికారంలోవున్నా... ఇదే ఆనవాయితీ కొనసాగుతోంది. ఈ విషయంపైన ఇటీవల శాసనమండలిలో పెద్ద రాద్ధాంతమే జరిగింది. వైసీపీ ఎంఎల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి చేసిన ఆరోపణ పెనుదుమారాన్ని లేపింది. వీసీల చేత బలవంతంగా రాజీనామాలు చేయించారన్న ఆయన అభియోగంపైన అధికార పార్టీ తీవ్రంగా మండిపడింది. అలా చేయించినట్లు రుజువులు ఉంటే చూపాలంటూ అధికారపక్షం ఆ ఆరోపణలను తిప్పికొట్టింది. ఇదంతా మనం టీవీలలో చూశాం, పత్రికలలో చదివాం. కానీ, ఇలా విశ్వవిద్యాలయాలను సైతం రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం వేదికలుగా వాడుకోవడం మంచి సంప్రదాయం కాదు. అది ఏ పార్టీ అయినా సరే... వాటి రాజకీయ ప్రయోజనాల కోసం విద్యాసంస్థల భవిష్యత్తుని తాకట్టుపెట్టడం భావ్యం కాదన్నది నా అభిప్రాయం. విద్యాసంస్థలకి , సేవాలయాలకి, వైద్యాలయాలకి రాజకీయ మకిలి అంటించొద్దని నా మనవి.

ప్రొఫెసర్ ఆర్.కే.రెడ్డి - విశాఖపట్టణం.




## బాబోయ్... దోమలు ప్రాణాలు తీస్తున్నాయ్!

దోమల్ని మనం అలుసుగా చూస్తుంటాం. కంటికి కనిపించనంత బుల్లి దోమలు ఇంతపెద్ద మానవ శరీరాన్ని ఏంచేస్తాయిలే అనుకుంటాం. కానీ, ఆ దోమలెంత ప్రమాదకరమో, వాటివల్ల ఎన్ని రకాల ప్రాణాంతక వ్యాధులు వస్తుంటాయో తెలిస్తే.. బాబోయ్! దోమలెంత డేంజరో అనుకోవాల్సిందే.

మనుషుల రక్తం మరిగిన దోమలు మనదేశంలోనే కాదు, ఒక్క ఐస్లాండ్‌లో తప్ప, ప్రపంచమంతా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా దోమకాటుకి బలై ప్రాణాలు పోగొట్టుకున్న వారి సంఖ్య లక్షల్లో కాదు.. కోట్లల్లోనే ఉంటుందంటే అతిశయోక్తి కాదేమో. దోమకాటుకు గురై ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. అయినా, ప్రభుత్వాలు కానీ, పాలకులు కానీ ఆశించిన స్థాయిలో వాటి నిర్మూలనకు కృషి చేయడంలేదు. ఫలితంగా దోమకాటు వల్ల నానా రోగాలతో బాధపడుతున్నవారు, అవి తీవ్రమై మృత్యువాత పడుతున్నవారి సంఖ్య తగ్గడంలేదు. ఏళ్ళ తరబడిగా ప్రజారోగ్యానికి పెనుముప్పుగా అవతరించిన ఈ దోమల సమస్య నివారించడానికి పాలకులు, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరం.

### ప్రభంజనంలా దోమలు.. ప్రబలుతున్న వ్యాధులు...

దోమల్లో చాలా రకాలున్నాయి. దాదాపు నాలుగువందలకు పైగానే దోమజాతులు ఉన్నట్లు మన శాస్త్రవేత్తల అంచనా. వాటిలో కొన్ని ప్రమాదకరమైన దోమలు కూడా వున్నాయి. మనిషిని కాటేసి రక్తం పీల్చేస్తుంటాయి. అవి ఒక్కసారి కుడితే చాలు, ఆసుపత్రుల పాలు కాకతప్పదు. వాటిలో ఏడిస్ ఈజిప్ట్, అనాఫిలిస్, క్యూలెక్స్ వంటి దోమలు ప్రధానమైనవి. ఏడిస్ ఈజిప్ట్ అనే దోమలు డెంగ్యూని, చికున్‌గున్యాని, జికా వైరస్‌ను అంటగడతాయి. అనాఫిలిస్ తెగ దోమలు మలేరియాతో బాధిస్తాయి. క్యూలెక్స్ దోమలు ఫైలేరియాసిస్ వంటి వ్యాధులను తెస్తాయి. జికా వైరస్ వంటి వ్యాధుల్ని అంటించే దోమల వల్ల తీవ్ర జ్వరం, కండ్లకలక, దద్దుర్లు వంటి సమస్యలతో పాటు, గర్భిణులను ఈ రకం దోమలు కుడితే, పుట్టబోయే బిడ్డల మీద కూడా వాటి ప్రభావం తీవ్రంగా ఉంటుందని వైద్య నిపుణులు చెప్తున్నారు. 'జపనీస్ బి ఎన్స్‌ఫాలిటిస్' అనే దోమల కాటు వల్ల ప్రాణాంతకమైన మెదడువాపు వ్యాధి వస్తుంటుంది. ఈ వ్యాధితో కూడా తరచూ ఎంతోమంది మరణిస్తున్నారు.

### కోట్లల్లో బాధితులు.. లక్షల్లో మరణాలు...

ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా సుమారు పదికోట్ల మందికి పైగానే డెంగీ బారిన పడి అల్లాడుతున్నారని, ప్రాణాంతక వ్యాధులతో లక్షలాదిమంది చనిపోతున్నారని నిపుణులు వెల్లడిస్తున్నారు. మనదేశంలో డెంగీ కేసులు పెద్ద సంఖ్యలోనే ఉంటున్నాయి. 2022 లెక్కల ప్రకారం భారత్‌లో 63వేలకు పైగానే డెంగ్యూ కేసులు నమోదయ్యాయని నిపుణులు చెప్తున్నారు. ఎక్కువగా ఆంధ్రప్రదేశ్, అరుణాచలప్రదేశ్, అస్సాం రాష్ట్రాల్లో డెంగ్యూ కేసులు పెద్దసంఖ్యలోనే ఉండడమే కాక, ఏటా పెద్దసంఖ్యలో మరణాలు కూడా సంభవిస్తున్నాయి. మలేరియా సైతం ప్రజల ప్రాణాలు తీసేస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం మనదేశంలో ఏటా లక్షలాదిమంది మలేరియాతో అవస్థలు పడుతున్నారు. సుమారు 20వేలమందికి పైగా మరణిస్తున్నారు. అంతేకాదు, దోమకాటు ద్వారా వచ్చే వ్యాధుల్లో బోద వ్యాధి ఒకటి. ప్రపంచంలోని బోదవ్యాధిగ్రస్తుల్లో దాదాపు సగం మంది మనదేశంలోనే ఉన్నారని నిపుణులు చెప్పడం గమనార్హం. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ఈ వ్యాధి ఎక్కువగా ఉంటోంది. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, శ్రీకాకుళం, నెల్లూరుజిల్లాల్లో ఈ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉన్నారని పరిశోధకుల అంచనా.

### దోమల నివారణకు ప్రత్యేక వ్యవస్థ ఉండాలి...

వర్షపు నీరు మడుగులు కట్టిఉండడం, మురుగునీటి గుంటలు కొల్లలుగా ఉండడం, కాలువలు కాలుష్యంగా మారడం, ఎక్కడ చూసినా చెత్తాచెదారం, అపరిశుభ్ర వాతావరణం దోమల వ్యాప్తికి ప్రధాన కారణాలని నిపుణులు విశ్లేషిస్తున్నారు. గ్రామాల్లోనే కాకుండా, ఇప్పుడు పట్టణాలు, నగరాల్లోనూ దోమలదే పెద్ద దందా అయిపోయింది. వాటి దండయాత్రకు ప్రజలు హడలిపోతున్నారు కూడా. రాత్రీ పగలూ సూదుల్లా పొడిచే దోమల వల్ల ప్రజల కంటికి కునుకుండడం లేదు. దోమలు కుడితే ప్రమాదం కనుక, అవి కుట్టకుండా చూసుకోవడమే ఇక మిగిలిన మార్గం. దోమతెరలు వాడుకోవడం, తలుపులు కిటికీలకు తెరలు ఏర్పాటుచేసుకోవడం, దోమల మందు వాడడం, బురద నీళ్ళలో, కాలువలలో గంబూసియా చేపలు వదలడం వంటివి తాత్కాలిక ప్రత్యామ్నాయాలే. నిల్వనీరు, మురుగుగుంటలు, సైడుకాలువలు, నీటితొట్లు ఇలా అపరిశుభ్ర వాతావరణం ఎక్కడుంటే అవన్నీ దోమలకు ఆవాసాలే. కాబట్టి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే మన తక్షణ కర్తవ్యం కావాలి. అదే శాశ్వత పరిష్కారం కూడా. అందుకోసం తరచూ కాలువలు శుభ్రం చేస్తుండాలి. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తుండాలి. ఖాళీ స్థలంలో నీరు నిల్వ ఉండకుండా వాటి యజమానులు వాటిని మట్టితో పూడ్చేలా గట్టి చర్యలు చేపట్టాలి.

### పరిశుభ్రతపై కఠిన చట్టాలు రావాలి..!

ప్రభుత్వాలు దోమలపై దండయాత్ర చేయాలి. అవసరమైతే ప్రత్యేక చట్టాలు తెచ్చయినా సరే, పరిశుభ్రతను అలవాటు చేయాలి. రాజకీయ నాయకులు, అధికార యంత్రాంగాలు, స్వచ్ఛంధ సేవా సంస్థల ప్రతినిధులు అందరూ కలసి కట్టుదిట్టమైన ప్రణాళికలు రూపొందించుకుని, పారిశుద్ధ్య పరిరక్షణ కోసం, పరిశుభ్రత పాటించేలా ప్రజలని చైతన్య పరచడం కోసం ప్రతిన బూనాలి. కోట్లాదిమందిని నరకయాతనకు గురిచేస్తున్న దోమకాటు నుంచి ప్రజలను కాపాడేందుకు గ్రామగ్రామానా ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేయాలి. లేదంటే, ప్రజారోగ్యం మాయమైపోతుంది, దోమల ధాటికి.. వాటి దాడికీ సర్వ సమాజం రోగాల మయమవుతుంది.

- రాజశ్రీ

## అంబరాన్నంటే సంబరంగా..
## ఆడంబర సంరంభంగా...

# ఆల్తూరు వారి పెళ్ళి సందడి!

ప్రముఖ వ్యాపారవేత్త, సినీ నిర్మాత, కాంట్రాక్టర్, ఆధ్యాత్మికతత్పరుడు ఆల్తూరు మహేష్‌రెడ్డి - శ్రీమతి రాధికల కుమారుడు (కీ॥శే॥ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి - శ్రీమతి సులోచనమ్మల మనుమడు) ఆల్తూరు **నితేష్ - కీర్తి** (దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్‌రెడ్డి - శ్రీమతి మంజుల కుమార్తె)ల కళ్యాణం మార్చి 6వతేదీ, వివాహ రిసెప్షన్ మార్చి 8వ తేదీ ఆడంబర సంబరాలుగా హైదరాబాదులో జరిగాయి. ఈ రెండు వేడుకలలో భారతదేశంలోని అనేక రాష్ట్రాలకి చెందిన పలువురు అత్యంత ప్రముఖులు పాల్గొన్నారు. రాజకీయ, వ్యాపార, సినీ రంగాలలోని దిగ్గజాలు, వారితో పాటు ఇతర అనేక విభాగాలకు చెందిన అతిరథ మహారధులు, ఆల్తూరు వారి పెళ్ళి, రిసెప్షన్ల సంబరాలకి హాజరై సందడి చేశారు. నితేష్ - కీర్తి దంపతులకి తమ దీవెనలు అందించారు. కొత్త జంటకి 'లాయర్' శుభాకాంక్షలు.











# చరిత్ర సృష్టించిన ఎమ్మెల్యే కోటంరెడ్డి!

## ఒకే రోజు 105 పనులకు శంకుస్థాపనలు



కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అనుకున్నది సాధించారు. నెల్లూరు రూరల్‌లో అభివృద్ధి పనులను ఒక జాతరలాగా బ్రహ్మాండంగా చేయాలన్న సంకల్పాన్ని నెరవేర్చుకున్నారు. ఈనెల 9వతేదీ ఒక్కరోజులోనే తమ రూరల్ నియోజక వర్గం పరిధిలో 40 కోట్ల రూపాయల విలువైన సీసీరోడ్లు, కాలువలు, తాగునీటి వసతుల పనులకు కనీవినీ ఎరుగని విధంగా 105 శంకు స్థాపనలు చేసి రికార్డు సృష్టించారు. శ్రీధర్‌రెడ్డితో పాటు ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి, కూటమి నాయకులు, పెద్దఎత్తున ప్రజలు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యాక ఈ 8 నెలల్లోనే తమ నియోజకవర్గంలో మొత్తం 191కోట్ల రూపాయలు వ్యయమయ్యే అభివృద్ధి పనులు జరుగుతుండడం పట్ల శ్రీధర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. మంత్రి లోకేష్ కూడా ఈ సమాచారం తెలుసుకుని..ఒకేరోజు ఇంత భారీగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి రికార్డు సృష్టించడం దేశ చరిత్రలోనే అరుదైనదంటూ కోటంరెడ్డిని కొనియాడారు.

# ‘కిమ్స్’లో అరుదైన చికిత్స



నెల్లూరులోని కిమ్స్ హాస్పిటల్స్‌లోని కార్డియాలజీ విభాగంలో ఇటీవల అరుదైన చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. గుండెనొప్పితో ఇటీవల ఆసుపత్రికి వచ్చిన ఓ వ్యక్తిని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ సిఎస్ శ్రీనివాసరాజు పరీక్షించారు. గుండెకు ఎడమవైపున ఉన్న ప్రధాన రక్తనాళం విభజన ప్రాంతంలో రెండు వైపులా రక్తనాళాలు పూడుకుపోయినట్లు గుర్తించారు. బైపాస్ ఆపరేషన్ అవసరమైన ఆ సమస్యకు, క్లిష్టమైన బయోమిమి బ్రాంచ్ అనే ప్రత్యేక స్టంట్లతో చికిత్స చేసి రోగిని కాపాడారు. ఎలాంటి ఆపరేషన్ కానీ, అదనపు ఖర్చు కానీ లేకుండా రోగికి ఆ వైద్యాన్ని అందించడం విశేషం. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరాజును కిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరినాయుడు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్‌కుమార్, వైద్యబృందం వారు అభినందించారు.

# మహిళాచట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మహిళలను గౌరవించాలని, మహిళాచట్టాలపై అందరూ అవగాహన పెంచుకోవాలని ప్రముఖ సామాజికవేత్త, జిల్లా లోక్‌అదాలత్ మధ్యవర్తిత్వ కమిటీ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి చెప్పారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఇటీవల నెల్లూరులోని ఆదిత్య డిగ్రీ–పీజీ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పీజీ కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.అంకయ్య అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కళాశాల అధ్యాపకులు కె.నిత్య, గ్రేషి ఇవాంజిలిన్ మాట్లాడుతూ, సాధికారత సాధించే దిశగా మహిళలు ఎదగాలని ఆకాంక్షించారు.

# నెల్లూరు కబుర్లు

## చికెన్ తినొచ్చు!.. బర్డ్ ఫ్లూ లేదు!



బర్డ్ ఫ్లూ ఉందని, చికెన్ తినకూడదని ఎవరూ ఎలాంటి అపోహ పడవద్దని, జిల్లాలో బర్డ్ ఫ్లూ లేదని, చికెన్ తినొచ్చని జిల్లా కలెక్టర్ ప్రకటించారు. బర్డ్‌ఫ్లూ వదంతులతో జిల్లావ్యాప్తంగా చికెన్ విక్రయాలు తగ్గిపోయిన నేపథ్యంలో, జిల్లా ప్రజలకి ఎలాంటి అపోహలు, అనుమానాలకు తావు లేకుండా ఇటీవల నెల్లూరు నగరంలోని విఆర్‌సి మైదానంలో జిల్లా పశుసంవర్ధక శాఖ, నేషనల్ ఎగ్, పౌల్ట్రీ బ్రీడర్స్ కోఆర్డినేషన్, జిల్లా పౌల్ట్రీ అసోసియేషన్లు సంయుక్తంగా నిర్వహించిన చికెన్ మేళాను కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు ఎక్కడా బర్డ్ ఫ్లూ కేసు నమోదు కాలేదని, ఎక్కడైనా బర్డ్ ఫ్లూ లక్షణాలు కనిపిస్తే, రెడ్ జోన్‌గా ప్రకటించి, అది విస్తరించకుండా గట్టిచర్యలు తీసుకునేందుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందన్నారు. పౌల్ట్రీ పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తిగలవారు ముందుకొస్తే పీఎంఈజీపి పథకం ద్వారా, బ్యాంకుల ద్వారా సబ్సిడీపై రుణాలు మంజూరుచేస్తామని కలెక్టర్ చెప్పారు. మంచి పోషక విలువలు గల చికెన్ వంటకాలు, కోడిగుడ్లను ప్రజలందరూ తీసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్ నాయక్, నెక్ మాజీ జోనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు, పౌల్ట్రీ అసోసియేషన్ నిర్వాహకులు, ప్రముఖులు రమేష్‌బాబు, గోపాలకృష్ణ, ప్రణీత్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులునాయుడు, ఆదినారాయణ, రాఘవరావు, అమరావతి కృష్ణారెడ్డి, ఎం.ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# అపోలో హాస్పిటల్ 10వ వార్షికోత్సవం



నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ 10వ వార్షికోత్సవం సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్.. మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, యూనిట్ హెడ్ బాలరాజు ఆధ్వర్యంలో ‘చికిత్స కంటే నివారణ మేలు’ అనే నినాదంతో నగరంలో వాకథాన్ కార్యక్రమం నిర్వహించారు. విఆర్సీ నుండి ప్రారంభమైన ఈ వాకథాన్ రామలింగాపురం మీదుగా చిల్డ్రన్స్ పార్కు వరకూ సాగింది. ఈ వాకథాన్‌లో అపోలో హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. ఆసుపత్రి సీఇఓ నవీన్ మాట్లాడుతూ, ఈ హాస్పిటల్‌ను 2015 మార్చి 8న అపోలో సంస్థ 50వ హాస్పిటల్‌గా ప్రారంభించామని, ఈ పదేళ్ల ప్రస్థానంలో వేల మందికి వైద్యసేవలందించడం సంతోషంగా ఉందని, వైద్యపరంగా ఎన్నో విజయాలను సాధించామని, మరెన్నో అవార్డులు, విశిష్ట గుర్తింపులు కూడా లభించాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక మందికి డయాలసిస్ సేవలు అందిస్తున్న హాస్పిటల్ నెల్లూరు అపోలో హాస్పిటల్ అని తెలిపారు.

## జయభారత్ ఆసుపత్రికి..

# జైన్ సేవాసదన్ వితరణ

### 12 లక్షల విలువ చేసే డయాలసిస్ మిషన్లు బహూకరణ



జైన్ సేవాసదన్ వారి సహకారంతో భగవాన్ మహావీర్ చారిటబుల్ ట్రస్ట్ వారి చొరవతో ఇటీవల నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రిలోని డయాలసిస్ విభాగానికి జైన్ సేవాసదన్ అధ్యక్షులు శాంతిలాల్‌జైన్ 12 లక్షల రూపాయల విలువచేసే డయాలసిస్ మిషన్లను బహుకరించారు. వాటిని ఆసుపత్రి కోశాధికారి గుర్రం సుధాకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా శాంతిలాల్ జైన్ మాట్లాడుతూ, నెల్లూరులో జైన సమాజం అనేక సంస్థలకు చేయూతనిస్తుందని తెలిపారు. ఆ సేవలో భాగంగానే జయభారత్ ఆసుపత్రిలో 10 మిషన్లతో ప్రారంభమైన భగవాన్ మహావీర్ డయాలసిస్ విభాగం ఇప్పుడు 20 మిషన్లతో నాలుగు షిఫ్ట్‌లను పూర్తి చేస్తుందన్నారు. ఇదేవిధంగా సోహన్‌లాల్ జైన్ షష్టిపూర్తి సందర్భంగా ఐసియు విభాగాన్ని ఆధునీకరించామన్నారు. ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సురేంద్రకుమార్, భగవాన్ మహావీర్ జైన్ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి జెపి జైన్, పరస్మాల్ జైన్, మిశ్రమాల్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.



## అందరినీ ఆకట్టుకున్న...

# ‘అమ్మంటే!’..షార్ట్ ఫిల్మ్

## కళాంజలి అనంత్ ప్రతిభకి మరో అవార్డు


అనంత్


శిరీష


బెనర్జీ


మద్దూరు


సంగీత్‌సౌరభ్


సుధాకర్

ప్రముఖ నటుడు– రచయిత–దర్శకుడు, నెల్లూరులోని కళాంజలి సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు కళాంజలి అనంత్ నవసమాజాన్ని చైతన్యవంతం చేసే పలు సామాజిక సందేశాలతో షార్ట్‌ఫిల్మ్‌లు రూపొందిస్తూ, తన అద్వితీయమైన దర్శకత్వ ప్రతిభతో పలు అవార్డులను కూడా సాధిస్తున్నారు. తాజాగా ఆయన ‘మనం మన తల్లితండ్రులను ఎలా చూస్తామో...రేపు మన పిల్లలు కూడా అలాగే చూస్తే?..’ అనే ఇతివృత్తంతో అద్భుతంగా రూపొందించిన ‘అమ్మంటే..!’ షార్ట్‌ఫిల్మ్ అనంతపురం ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన పోటీలలో ఉత్తమ షార్ట్‌ఫిల్మ్ అవార్డును అందుకుంది. ఈ సందర్భంగా ఈనెల 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున నెల్లూరు టౌన్‌హాలులోని వర్ధమాన సమాజం రీడింగ్ రూమ్‌లో 5 నిమిషాల నిడివిగల ‘అమ్మంటే..!’ షార్ట్‌ఫిల్మ్‌ను ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం నటీనటులు శిరీష, బెనర్జీ, గీత రచయిత మద్దూరు, సంగీతం–గానం సంగీత్‌సౌరభ్, మేకప్‌మేన్ సుధాకర్‌లకు ఏపీ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ తరపున, కళాంజలి అనంత్ సారథ్యంలో ఆత్మీయ సన్మానాలు జరిగాయి. ‘నుడా’ ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి సతీమణి కోటంరెడ్డి సంధ్య, గోవిందరాజుల సుభద్రాదేవి, మొయిళ్ళ గౌరిరెడ్డి, ఎం.కామాక్షిదేవి, డాక్టర్ మారం విజయ లక్ష్మితో పాటు కె.రాజేశ్వరి, సంధ్య శేఖర్, డాక్టర్ నీలం స్వాతి తదితర మహిళా ప్రముఖులు పాల్గొన్నారు. ఈ షార్ట్‌ఫిల్మ్‌కి అంతా తానే అయి కార్యభారం సహించి, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహించిన కళాంజలి అనంత్‌ను అందరూ ఘనంగా సన్మానించారు.






# ‘నరసం’ మహిళా దినోత్సవం



నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం (నరసం) ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరులో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఆ సంఘం నెల్లూరు అధ్యక్షురాలు..ప్రముఖ కవయిత్రి గోవిందరాజు సుభద్రాదేవి ఆధ్వర్యంలో ఎస్వీ యూనివర్శిటీ విశ్రాంత పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి అక్కరాజు శమంతకమణిని రచయిత్రులు ఘనంగా సత్కరించారు. నరసం సభ్యులు లక్ష్మి, భారతి, సులోచన, ప్రసూనశరత్, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం, కవితలు–ఆటపాటలతో ఈ కార్యక్రమం వేడుకగా జరిగింది.

# 'అప్పుల కుప్ప' నుంచి.. అభివృద్ధి వైపు...!

## - మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



గత ప్రభుత్వ నిర్వాకాలతో అప్పులకుప్పగా మారిన రాష్ట్రాన్ని, కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గాడిన పెడుతోందని, ప్రజలకు ఇచ్చిన హామీలను క్రమంగా నెరవేరుస్తూ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారధ్యంలో తమ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, పేదల సంక్షేమం కోసం అనునిత్యం కష్టపడుతూ, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా పాలన సాగిస్తోందని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఈనెల 10న నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో, ఆత్మకూరు నియోజకవర్గంలోని 27 మంది పేద లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ, పేదలకు ఎటువంటి కష్టం రాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక రకాలుగా సంక్షేమాన్ని అందిస్తుందన్నారు. ఇప్పటికే ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను నాలుగు వేలకు పెంచడం, మహిళలకు ఉచితంగా మూడు సిలిండర్లు అందించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం కేంద్ర ఆర్థిక సంఘ నిధులను పంచాయతీలకు అందించకుండా పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక 15వ ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీలకు పంపిందని చెప్పారు.

# ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్న ముఖ్యమంత్రి

## • కొనియాడిన వేమిరెడ్డి దంపతులు

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటూ తన మానవీయతను చాటుకుంటున్నారని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు.. కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కొనియాడారు. ఇటీవల కోవూరు తహసీల్దారు కార్యాలయం ఆవరణలో వేమిరెడ్డి దంపతులు కోవూరు నియోజకవర్గ పరిధిలోని 60 మందికి 71 లక్షల 40 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందచేశారు. ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, మెరుగైన వైద్య అవసరాలకు పేదరికం అడ్డు కాకూడదన్న ఆశయంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సిఎంఆర్ఎఫ్ నిధుల ద్వారా వేలాది కుటుంబాలను ఆదుకుంటున్నారన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే కూటమి ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని ఆమె చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చినప్పటి నుంచి కోవూరు నియోజకవర్గంలో కోటీ నలభై లక్షల రూపాయల వరకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందాయని, అనారోగ్యం బారినపడి ఆర్థికంగా చితికి



పోయి కష్టాలలో ఉన్న కుటుంబాలకు సిఎంఆర్ఎఫ్ సహాయం కొండంత అండగా నిలుస్తుందని అన్నారు. పెన్నా డెల్టా ఛైర్మెన్ జెట్టి రాజగోపాలరెడ్డి, కోవూరు సర్పంచ్ యాకసిరి విజయ, ఎంపీపీ తుమ్మల పార్వతి, వేగూరు సర్పంచ్ అమరావతి, టీడీపీ సీనియర్ నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కోడూరు బీచ్ అభివృద్ధికి.. నిధులివ్వండి



## • ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరుజిల్లా తోటపల్లి గూడూరు మండలంలోని కోడూరు బీచ్‌కి ఎంతో ప్రాధాన్యం ఉందని, దాని అభివృద్ధికి చర్యలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తగు చర్యలు చేపట్టాలని ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సర్వేపల్లి ఎమ్మెల్యే..మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. ఇటీవల ఆయన అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతూ, కోడూరు బీచ్ వద్ద ప్రసిద్ధమైన వేళాంగిణి మాత చర్చి ఉండటంతో ప్రతి వారం వేలాదిగా పర్యాటకులు వస్తుంటారని తెలిపారు. అదేవిధంగా, కోడూరు బీచ్‌కి సమీపంలోనే కృష్ణపట్నం పోర్టు, పవర్ ప్రాజెక్టులున్నాయని, ఈ ప్రాంతమంతా పారిశ్రమలు ఉండడంతో నిత్యం అనేకమంది కార్మికులు బీచ్‌కి వచ్చి సేద తీరుతుంటారని, నెల్లూరు నగరం, చుట్టుపక్కల అనేకచోట్ల నుంచి కూడా ప్రజలు, సందర్శకులు వస్తుంటారని, ఈ నేపథ్యంలో బీచ్‌లో వాటర్ స్పోర్ట్స్, టూరిజం పార్కు ఏర్పాటుచేస్తే బావుంటుందని ఆయన అసెంబ్లీ దృష్టికి తీసుకువచ్చారు. అయితే, బీచ్‌కి వెళ్లేదారి మాత్రం బాగాలేదని, దీంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, వాహనాల రాకపోకలకు మరీ ఇబ్బందిగా ఉందని, మహాలక్ష్మిపురం నుంచి బీచ్‌కి వెళ్లే రోడ్డు గుంటలు గతుకులతో దారుణంగా ఉందని, ఆ రోడ్డు నిర్మాణానికి రూ.3.50 కోట్లు అవసరమవుతాయని, ఆ నిధులు మంజూరు చేయాలని ఇప్పటికే పర్యాటక శాఖ మంత్రిని కోరివున్నామని తెలిపారు. అందుకు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ సానుకూలంగా స్పందించారని, ప్రభుత్వం పరిశీలించి వెంటనే ఆ నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# బీద రవిచంద్రకి.. లోకేష్ అభినందనలు

తెలుగుదేశం పార్టీ తరపున శాసనమండలి అభ్యర్థిగా రెండవసారి ఎంపికైన టీడీపీ సీనియర్ నాయకుడు, జాతీయ ప్రధానకార్యదర్శి బీద రవిచంద్ర ఈనెల 10న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, యువనేత.. నారా లోకేష్‌ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా లోకేష్, బీద రవిచంద్రను అభినందించారు.

# రికార్డు స్థాయిలో.. ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా గత శనివారం ఒక్క రోజే రికార్డు స్థాయిలో 965.080 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ, 24 గంటల్లోగా రైతుల ఖాతాలకు డబ్బులు జమ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 2026.920 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, రైతులందరూ గమనించి, దళారులకు ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఆయన రైతులని కోరారు.







## సౌమ్యుడు.. ఆధ్యాత్మిక సేవాతత్పరుడు..

# పత్తి రవీంద్రబాబు కన్నుమూత!



నెల్లూరు ట్రంకురోడ్డులోని సాయినాథ్ కంపెనీ అధినేత, శ్రీ రంగనాథస్వామి దేవాలయ పాలకమండలి ఛైర్మెన్‌గా రెండుసార్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త.. సమాజసేవకుడు పత్తి రవీంద్రబాబు ఈనెల 8వ తేదీన అనారోగ్యంతో నగరంలోని కిమ్స్ ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆయన వయసు 75 ఏళ్లు. ఆయనకు భార్య రాజదుర్గ, కుమారుడు సీతారామ్‌బాబు, కుమార్తె శ్రీమహాలక్ష్మి ఉన్నారు.

నెల్లూరీయులైన ప్రముఖ వ్యాపారవేత్త పత్తి నరసింహులు శెట్టి–లలితమ్మ దంపతులకు రవీంద్రబాబు 1949లో ప్రథమ సంతానంగా జన్మించారు. వ్యాపార రంగంలో పేరెన్నికగన్న పత్తివారి కుటుంబమంటే నెల్లూరీయులందరికీ చిరపరిచితులే. 1939 ప్రాంతాల్లోనే ఆయన తండ్రి నరసింహులుశెట్టి నెల్లూరులో సాయినాథ్ కంపెనీని నెలకొల్పారు. ఎలక్ట్రిక్ గృహోపకరణాలకు అది బాగా ప్రసిద్ధిగా ఉండేది. అప్పట్లో లైసెన్సులు చెల్లించి రేడియోలు వినియోగించుకునే రోజుల్లోనే, ఆయన ప్రఖ్యాతిచెందిన ఫిలిప్స్ రేడియో కంపెనీకి అధీకృత డీలరుగా ఉండేవారంటే వ్యాపారరంగంలో వారెంత ప్రఖ్యాతమైనవారో అర్ధమవుతుంది. తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న రవీంద్రబాబు కూడా ఆయన అడుగుజాడల్లో నడుస్తూ అదే వ్యాపారంలో స్థిరపడిపోయారు. సహజంగానే నెమ్మదస్తుడు, సహృదయుడైన రవీంద్రబాబు అందరితో కలుపుగోలుగా ఉండేవారు. ఆయన మంచితనమే ఆయనకు పలు పదవుల్ని కట్టబెట్టాయి. నెల్లూరులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన రంగనాథస్వామి దేవాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్‌గా ఉంటూ, రంగనాథుని సేవలో తరించారు. అంతేకాదు, కేంద్రప్రభుత్వ సంస్థగా ఉన్న గోవా పోర్ట్ ట్రస్ట్‌కు ఆయన రెండుసార్లు సభ్యునిగా ఉన్నారు. అదేవిధంగా, కొచ్చిన్ పోర్ట్ సభ్యునిగా కూడా పనిచేశారు. రాజకీయరంగంలోనూ ప్రవేశించి, నెల్లూరు మునిసిపాలిటీగా ఉన్న రోజుల్లో.. ఒక పర్యాయం ఆయన కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. జిల్లాలోని ప్రముఖ రాజకీయ కుటుంబాలతో ఆయనకు సన్నిహిత సంబంధాలుండేవి. ఆనం, నేదురుమల్లి, పనబాక, మాగుంట కుటుంబాలకు ఆయన ఆత్మీయులుగా ఉండేవారు. ఆయా పార్టీల నాయకులు వేరైనప్పటికీ, రవీంద్రబాబు మాత్రం పార్టీలకు, వర్గాలకు అతీతంగా వ్యవహరిస్తూ, అందరితో ఆత్మీయంగా ఉండేవారు. వారు కూడా ఆయన్ను తమవారిగానే భావించేవారు. నెల్లూరు నవాబుపేటలో ఉన్న పత్తివారి స్కూలు, 3వ మైలు వద్దనున్న పత్తివారి సత్రం వారి పూర్వీకులు కట్టించినవే. ఆ స్కూలుకు రవీంద్రబాబు ఇటీవలి వరకు మేనేజింగ్ ట్రస్టీగా కూడా ఉండేవారు. మొన్నమొన్నటిదాకా కూడా ఆయన ఆరోగ్యవంతులుగానే ఉన్నప్పటికీ, ఉన్నట్లుండి అస్వస్తతకు గురై ఆసుపత్రిలోనే తుదిశ్వాస విడిచారు. స్థానిక కేవీఆర్ పెట్రోలు బంకు సమీపంలోని వారి నివాసంలో ఆయన పార్థివదేహాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తదితర నాయకులు, ఎందరో ప్రముఖులు సందర్శించి కడసారి నివాళులర్పించారు. ఆయన ఉత్తరక్రియలు ఈ నెల 24వ తేదీ వారి స్వగృహంలో జరుగనున్నాయి. ఏదేమైనా సౌమ్యుడు, మృదుస్వభావి, అన్నిటికీమించి మంచి స్నేహపాత్రుడైన రవీంద్రబాబు ఇక లేకపోవడం బాధాకరం. ఆయన ఆత్మకు సద్గతి కలగాలని ఆశిస్తూ, వారి కుటుంబసభ్యులకు మనోధైర్యం కల్పించాలని ఆ భగవంతుడిని కోరుకుంటోంది..'లాయర్'!..

# కష్టపడినవారికి..పార్టీలో గుర్తింపు ఉంటుంది

### నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో, పార్టీ అభ్యున్నతికి కృషిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని, కార్యకర్తలు–నాయకులు సమన్వయంతో పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని వైకాపా నేత, వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఇటీవలవెంకటగిరి నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు బి.దయాకర్‌రెడ్డి (తురిమెర్ల), రైతు విభాగం అధ్యక్షులు కె.సుబ్బారెడ్డి (చాగణం)లు వాకాడులోని నేదురుమల్లి నివాసంలో రామ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి, ఆత్మీయంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, వైఎస్సార్సీపీలో పదవులు పొందినవారు రెట్టింపు ఉత్సాహంతో మరింత కష్టపడి నియోజకవర్గంలో పార్టీని తిరుగులేని శక్తిగా మార్చేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాకాడు, చిట్టమూరు, కోట, సైదాపురం మండల నాయకులు ఉన్నారు..

# అనాధాశ్రమంలో..అన్నదానం



బుచ్చిరెడ్డిపాళెం, రేబాల గ్రామంలోని డా.బాబాసాహెబ్ అంబేద్కర్ యువజన కమిటీ అధ్యక్షులు బాసికాల శ్యామ్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఇటీవల అన్నదాన కార్యక్రమం జరిగింది. మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో, రేబాల గ్రామంలోని ఆశాదీప్ మరియు నిరూప ఓల్డేజ్‌హోం(అనాధాశ్రమం)లోని నిరుపేదలకు మంచి భోజనం పెట్టి, కొత్త దుస్తులు అందజేశారు. ఆ కమిటీ ప్రతినిధులు మస్తానయ్య, వంశీధర్, సురేంద్ర, రమేష్, మల్లికార్జున్, వన్నం సురేష్, జయచంద్ర, పవన్‌కుమార్, వెంకటేష్, వినయ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# బీద సోదరులను కలిసిన సునీల్



ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీద రవిచంద్రని ప్రకటించడంతో అసెంబ్లీ వద్ద ఆయన్ను, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావులను గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఈ నెల 10వ తేదీ మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సంబరాలు చేశారు. శీలం కిరణ్‌కుమార్, బీరం రాజేశ్వరరావు పాల్గొన్నారు. కాగా, ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన బీద రవిచంద్రను ఉండవల్లిలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు కలిసి సన్మానించారు.

# ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

### - తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



జాతీయ రహదారి కూడళ్లలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నామని తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. నాయుడుపేట పోలీస్ స్టేషన్‌ను ఈ నెల 10వ తేదీ ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారులపై జరిగే ప్రమాదాల నివారణకు తమ సిబ్బందికి సూచనలు చేస్తున్నట్లు తెలిపారు. రహదారులపై వాహనాలు నిలపడం, అపసవ్యదిశలో వెళ్లడం వంటివాటిపై జరిమానాలు విధిస్తూ అవగాహన కల్పిస్తున్నామన్నారు. మహిళల సమస్యల పరిష్కారానికి పోలీసు సిబ్బంది తగిన రీతిలో స్పందించాలన్నారు. రికార్డులు పరిశీలించి సూచనలు చేశారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, టౌన్ సి.ఐ బాబి, ఎస్సైలు ఉన్నారు.

# ఒంటరి మహిళలు జాగ్రత్త

### డీఎస్పీ గీతాకుమారి



గూడూరు బ్రాహ్మణ సేవా సంఘ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ స్థానిక యం.యస్.కళ్యాణ మండపంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గూడూరు పట్టణ డీఎస్పీ డాక్టర్ గీతాకుమారి మాట్లాడుతూ ఒంటరి మహిళలపై నిఘా ఉంచి దుండగులు దాడులు చేస్తున్నారని.. కావున ఒంటరి మహిళలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం పాటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గీతా కుమారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి సంఘ అధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్ అధ్యక్షత వహించగా, సెక్రెటరీ చిట్టమూరు శ్రీనివాసరావు, కోశాధికారి విద్యాలలిత, సభ్యులు పాల్గొన్నారు.

# 25 నుండి ముత్యాలమ్మ జాతర



చిల్లకూరు మండలం తూర్పుకనుపూరు గ్రామంలో స్వయంభువుగా వెలసిన శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర ఈనెల 25 నుండి 28 వరకు జరగనున్న సందర్భంగా సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా ఆధ్వర్యంలో అమ్మవారి సన్నిధిలో ఇటీవల జాతర ఏర్పాట్లపై డివిజన్ పరిధిలోని అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డి.ఎస్.పి గీతాకుమారి, ఆలయ అధికారి నవీన్‌కుమార్, చిల్లకూరు, కోట తహసీల్దార్లు శ్రీనివాసులు, జయజయరావు, ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, ఎక్సైజ్ శాఖ సిఐ షరీనా, ఆలయ కమిటీ ఛైర్‌పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.



# కోర్టు ప్రాంగణంలో లోక్‌అదాలత్

గూడూరు రెండవ పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో ఈ నెల 8వతేదీ జాతీయ లోక్‌అదాలత్, మహిళా దినోత్సవ కార్యక్రమాలు ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మి పర్వీన్ సుల్తానా బేగం అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కోర్టుల చుట్టూ తిరుగుతూ తమ విలువైన సమయాన్ని వృధా చేసుకోకుండా లోక్‌అదాలత్‌లను కక్షిదారులు ఉపయోగించుకుని, రాజీపడి తమ కేసులను పరిష్కరించుకోవాలన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి బి.రాజేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బివి.సులోచన రాణి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ పి.శంకరయ్య, ఏపీపీ లక్ష్మీనారాయణ, బార్ ప్రెసిడెంట్ భాస్కర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

# గర్భిణీ స్త్రీలకి జేవీవీ భోజనాలు



గూడూరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నందిమండలం బాలకృష్ణ రాజు దాతృత్వంతో గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిరుపేద గర్భిణీ స్త్రీలకు వెజిటెబుల్ రైస్, గుడ్డు, అరటిపండ్లు, వాటర్ బాటిల్స్‌ను ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ షరీనా, డాక్టర్ రాజా చేతులమీదుగా ఈ నెల 10వతేదీ పంపిణీ చేశారు. అనంతరం షరీనా జనవిజ్ఞాన వేదిక వారు 11 సంవత్సరాల నుండి నిరంతరాయంగా ఈ కార్యక్రమం చేస్తున్నందుకు అభినందనలు తెలిపారు. దాత బాలకృష్ణంరాజు, నాగరాజు, చెంచు నారాయణ, పురుషోత్తమరావు పాల్గొన్నారు.



## జానకిరామ.. రామాయణం 56

- ఊటుకూరు జానకి రామారావు



అదుగో! దూరంగా ఏదో ధ్వని వినపడుతోంది.

అది రాక్షసులు దండుగా బయలుదేరి వస్తున్నట్లుగా అనిపిస్తుంది. అది వారుచేసే కోలాహలమే! భేరీల భయంకరమైన శబ్దం వినపడుతుంది. నీవు వెంటనే నీ వదినగారిని సమీపంలోని కొండగుహలోనికి తీసుకెళ్ళి రక్షణగా ఉండు. నేను రాక్షసుల సంగతి చూస్తాను, అని అన్నాడు రాముడు.

లక్ష్మణుడు సీతమ్మను భద్రంగా తీసుకొని వెళ్ళిన తరువాత రాముడు కవచం తొడుక్కొన్నాడు.

తన ధనుస్సు చేతిలోనికి తీసుకొన్నాడు. ధనుష్టంకారం చేశాడు.

ఆ శబ్దం వేయిపిడుగులు ఒక శ్రేణిలో.. అనగా ఒక వరుసలో పడినప్పుడు ఏ విధమైన ధ్వని వస్తుందో ఆ విధమైన ధ్వనిని తలపించింది. ఆ ధ్వని తరంగాలు గాలిలో వ్యాపించి అవి విన్న వారి హృదయాలలో గొప్పభయాన్ని పుట్టించాయి.

సకల ఋషిగణాలు, దేవతలు, సిద్ధులు, గంధర్వులు అందరూ అక్కడ వచ్చి చేరారు, జరగబోయే ఘోర యుద్ధాన్ని వీక్షించడానికి.

దుర్నిరీక్షమైన తేజస్సుతో ధనుస్సు ఎత్తిపట్టి నిలిచిన రాముడు చూడటానికి భయం కొల్పుతున్నాడు.

ఆయన ఆకృతిలో ఒక ఉగ్రత్వం, ఒక తేజస్సు కలగలసి ప్రళయకాల రుద్రుడి లాగా కనపడుతున్నాడు.

**రూపమప్రతిమం తస్య రామస్యాక్లిష్ట కర్మణః**
**బభూవ రూపం క్రుద్ధస్య రుద్రస్యేవ మహాత్మనః**

క్రుద్ధుడైన రుద్రుడిలాగా ఉన్నాడట, ఏ పనినైనా అత్యంత సులువుగా చేయగల రాముడు.

ఇంతలో నలుమూలలనుడి కలకలం చెలరేగింది. నాలుగు వైపుల నుండీ ముంచెత్తే వరదలాగా సైనికులు నలువైపులనుండీ కమ్ముకుంటూ, మండలాకారంగా దూరంనుండే చుట్టుముట్టుకుంటూ వస్తున్నారు.

వారిని చూడగానే ఆయన చేతిలోని ధనుస్సు రుద్రుడి చేతిలోని పినాకంలాగా భాసిల్లింది.

ఒక అడుగు ముందుకు వేసి ధనుస్సును గట్టిగా పట్టుకున్నాడు.

అప్పుడాయన రుద్రుడైనాడు, వీరభద్రుడైనాడు, ప్రళయకాల ప్రభంజనమైనాడు.

ఆ రాక్షసులంతా వస్తూ వస్తూనే వేలకొలదిగా ఆయుధాలు రాముడి మీద ప్రయోగిస్తూ వస్తున్నారు.

శూలాలు, ముద్గరాలు, ఖడ్గాలు, గండ్రగొడ్డళ్ళు, ప్రాసలు మొదలైన ఆయుధాలు ఆయన మీదికి దూసుకుంటూ వస్తున్నాయి.

ఒక్కడు రాముడు! వేలకొలదిగా రాక్షసులు!

చూసే సిద్ధ, గంధర్వ, మహర్షి గణాల వదనాలలో అయ్యో అనెడి జాలి చెలరేగింది. హృదయాలలో విషాదం నిండింది.

రాక్షసులు ప్రయోగించిన ఆయుధాలు రాముడి శరీరానికి తగిలి ఆయన శరీరం పూచిన మోదుగ అయ్యింది, నీలాకాశంలో ప్రజ్వరిల్లే అగ్ని అయ్యింది, సహజ శాంతచిత్తుడు క్రోధ మనస్కుడయ్యాడు.

చేతిలోని కోదండం ఒక ఆట బొమ్మ అయ్యింది.

దానిని ఎప్పుడు వంచుతున్నాడో, ఎప్పుడు గిరగిర తిప్పుతున్నాడో ఎవరికీ తెలియటంలేదు.

ఎవరికీ రాముడు కనపడటం లేదు. రివ్వున గుండ్రంగా తిరుగుతున్న ఒక తేజఃపుంజంగా భాసిల్లుతున్నాడాయన.

ఆయన వింటి నుండి వెలువడ్డ బాణాలు రాక్షసుల గుండెల నుండి దూసుకుంటూ వెళుతున్నాయి.

వారి శరీరాలను రాసుకుంటూ వెళుతున్నాయి.

వారి అవయవాలను కోసుకుంటూ వెళుతున్నాయి.

ప్రయోగించేది ఒక్కడే!..

కానీ, ఏ బాణం ఎటునుండి వస్తుందో అర్థం కాలేదెవరికీ, ఆకాశమంతా రామధనుర్విముక్త శరాలే.

ఆ బాణాలు రాక్షస సైన్యం నిలుచున్న ప్రదేశాన్నంతా కప్పివేశాయి.

శిరస్సులు బంతుల్లాగా గాలిలో తేలుతున్నాయి, కవచాలు బద్దలవుతున్నాయి, గుండెలు పగులుతున్నాయి.

ఎటుచూసినా భయంగా, దీనంగా రోదించే రాక్షసులే కనపడ్డారు.

దెబ్బలకు తాళలేక పరుగెడుతుంటే వారిని ఉరికించి ఉరికించి మరీ కొడుతున్నాడు రాఘవుడు.

దెబ్బలకు ఓర్వలేని సైన్యానికి ధైర్యం చెప్పి దూషణుడు వచ్చాడు రాముడి మీదకు.

దూషణుడు ఉన్నాడన్న ధైర్యంతో చావగా మిగిలిన వారంతా రాముణ్ణి మరల చుట్టుముట్టారు.

ధనుస్సు ఎక్కుపెట్టింది, నారి సారించింది, బాణం తొడిగింది, విడిచిందీ.. ఏదీ కనపడటం లేదు ఎవరికీ!

కేవలం తమ తోటి వారు బాణపు దెబ్బకు కూలి నేల రాలటం మాత్రమే చూస్తున్నారు.

బాణం వదిలే శబ్దం ఉరుములాగా ఉంది.

అది లక్ష్యాన్ని ఛేదించి భూమిలో దిగబడుతున్నప్పుడు పిడుగులాగా ధ్వనిస్తుంది.

ఇవి మాత్రమే ఏ కొంచెం కూడా విరామం లేకుండా వినపడుతున్నాయి.

క్రమంగా రాక్షసుల సంఖ్యా బలం తగ్గిపోయింది.

దూషణుడు, త్రిశిరుడు, ఖరుడు మాత్రమే మిగిలారు.

దూషణుడు.. వీడు ఖరుడి సేనాపతి. తన ఎదురుగా సేన మొత్తం నాశనం అవ్వటాన్ని చూసి వాడిలో పట్టరాని ఆవేశం పుట్టింది. వజ్రాయుధాల వంటి బాణాలతో ఒక్కసారిగా రాముణ్ణి కప్పివేశాడు. వాడి ఆక్రమణను చూసి రాముడికి కోపం హెచ్చి, ఒక అర్ధచంద్రాకారపు బాణంతో వాడి ధనుస్సు త్రుంచి, ఇంకొక నాలుగు బాణాలతో వాడి రథానికి పూన్చిన గుర్రాలను చంపివేశాడు. ఇంకొక బాణంతో సారథిని నేల కూల్చాడు. ఈ పనులన్నీ ఒకదాని వెంట మరొకటి రెప్పపాటు కాలంలో పూర్తిచేశాడు రాముడు.

దూషణుడు ఇంకా రెచ్చిపోయాడు, రథం మీదున్న బంగారపు పట్టీలు, ఇనుపమేకులతో కూడి ఉన్న పరిఘను బయటకు తీశాడు. దానికి శత్రుసైనికుల శరీరాలను మర్దించినప్పుడు కారిన వస దట్టంగా అంటిఉంది.

తనమీదకు ఆయుధాన్ని పట్టుకొని దూకుడుగా వస్తున్న వాడి బాహువులను రెండింటినీ ఖండించి వేశాడు రామచంద్రుడు. రెండుచేతులూ నేలపై రాలగా వాడు నిలువలేక నేలపై దబ్బున పడిపోయాడు.

ఎటు చూసినా రాక్షస కళేబరాలే.. వారి రక్తం ఏరులై ప్రవహిస్తూ నేలను బురదబురదగా చేసింది. సుందరమైన ఆ ప్రాంతమిప్పుడు నరకాన్ని తలపిస్తోంది.

తన సేన మొత్తం ఆవిధంగా నాశనం అవ్వటం చూసిన ఖరుడు కోపం పట్టలేక రాముడి మీదికి దూసుకుంటూ వస్తున్నాడు, వాడి మార్గానికి అడ్డంగా త్రిశిరుడు అనే సేనాపతి వచ్చి నిలిచి ప్రభూ! నీకెందుకు శ్రమ నేనున్నానుగా అంటూ వాడిని త్రిప్పి పంపి, ముందుగా మృత్యువును తానె కౌగలించుకోవాలన్నట్లుగా రాముడితో యుద్ధానికి బయలుదేరాడు.

ఇద్దరి మధ్యా ఘోరమైన యుద్ధం జరిగింది. ఒక సింహానికి ఒక ఏనుగుకు మధ్య జరిగినట్లుగా ఉందది.

త్రిశిరుడు ప్రయోగించిన మూడు బాణాలు రాముని నుదురుకు తగిలి బాధించాయి. వాడి పరాక్రమాన్ని మెచ్చుకుంటూనే, రా! ఇదిగో నా బాణాలు కూడా స్వీకరించు నీవు! అంటూ వాడి వక్షస్థలం మీద బలంగా పద్నాలుగు బాణాలతో కొట్టాడు. వాడు తేరుకోకముందే వాడి సారథిని, గుర్రాలను ఒక్క వేటున నేలకూల్చాడు. అది గమనించిన త్రిశిరుడు గాలిలోకి ఎగురబోగా వాడిగల శరములతో వాడి వక్షస్థలం బద్దలు కొట్టాడు. ఇంకొక బాణంతో వాడి శిరస్సు ఖండించి వేశాడు.

ఖరుడికి ఒక్కసారిగా గుండె జలదరించింది, ఈ మానవుడేంటి? ఇలా ఒంటరిగా ఇన్నివేలమంది వీరాధివీరుల తలకాయలు ఎగురగొట్టడమేమిటి?

అని వాడిలో ఒక రకమైన జంకు కలిగింది. అయినా మూర్ఖంగా కోపించి ధనుస్సు ఎత్తిపట్టుకొని నారి సారిస్తూ రాముడి మీదకు వెళ్ళి అస్త్రాలతో రకరకాల విన్యాసాలు చేశాడు.

ఇద్దరి ధనుస్సులనుండి బయల్వెడలిన బాణాలు ఆకాశాన్నంతా కప్పివేసి సూర్యకిరణాలు జొరబడటానికి కూడా అవకాశం లేకుండా చేసివేశాయి.

దెబ్బతిన్న పులిలాగా, తోకతొక్కిన త్రాచులాగా ఖరుడు మీదమీదకు వస్తున్నాడు.

రాముడిని తీవ్రమైన బాణాలతో వేధిస్తున్నాడు వాడు.

రాముడు అంతమందినీ ఎదుర్కొని ఉన్నాడు కాబట్టి అలసిపోయి ఉన్నాడనుకొన్నాడు. కానీ, యుద్ధం జరుగుతున్న కొద్దీ అవక్రపరాక్రముడైన రాముని రణోత్సాహం ద్విగుణీకృతం అయ్యింది.

.. (సశేషం)

# సంప్రదాయవాదమే పరిష్కారమా?

మనసులో మాట 36

ప్రపంచ వ్యాప్తంగా రాజకీయ పరిణామాలు మారుతున్నాయి. జాతీయవాదమే ప్రధానాంశంగా ఈ పరిణామాలు రూపుదిద్దుకుంటున్నాయి. ఆయా దేశాల్లో ప్రజల నుంచి జాతీయవాదానికి క్రమంగా మద్దతు పెరుగుతున్నట్లు గడచిన దశాబ్ద కాలం నుంచి ప్రపంచవ్యాప్త పరిణామాలను గమనిస్తే అర్థమవుతోంది. ఈ మద్దతు క్రమంగా ఒక రూపుదాల్చి స్థిరమైన జాతీయ వాద ప్రభుత్వాల ఏర్పాటుకు కూడా దారితీసింది. జాతీయవాదాన్ని భుజాన మోస్తున్న రాజకీయపార్టీలు లేదా నేతలు ఇప్పుడు తమ తమ దేశాలకే పరిమితం కాకుండా అంతర్జాతీయంగా సమన్వయ పర్చుకుంటూ బలమైన సంప్రదాయ వేదికను ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల సంప్రదాయవాద రాజకీయ కార్యాచరణ సదస్సును (కన్సర్వేటివ్ పొలిటికల్ యాక్షన్ కాన్ఫరెన్స్) కూడా నిర్వహించారు. ఈ సదస్సులో వీడియో లింక్ ద్వారా మాట్లాడిన ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఉదారవాదులు, వామపక్షవాదులపై తన ఆగ్రహాన్ని ఏ మాత్రం దాచుకోలేదు. వారిపై కఠిన పదజాలంతో విరుచుకుపడ్డారు. భారత ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్, తాను, అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలీ వంటి వారు కలిసి కొత్త ప్రపంచ సంప్రదాయవాద ఉద్యమాన్ని రూపొందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని, దీంతో ఉదారవాదులు, వామపక్షవాదుల్లో ఆందోళన నెలకొందని విమర్శించారు.

రాచరిక వ్యవస్థ నుంచి నేటి ప్రజాస్వామ్య రాజకీయాల దాకా ప్రపంచ రాజకీయ వ్యవస్థల్లో ఎన్నో సర్దుబాట్లు, దిద్దుబాట్లు జరుగుతూ వచ్చాయి. రకరకాల సమీకరణలు మారాయి. వివిధ కుదుపులకు లోనయ్యాయి. అదంతా పెద్దచరిత్ర. అయితే, ప్రపంచ వ్యాప్త రాజకీయాలను స్థూలంగా రెండు రకాలుగా వర్గీకరించొచ్చు. ప్రజాస్వామ్య రాజకీయాలు, వామపక్ష రాజకీయాలు. ప్రజాస్వామ్య రాజకీయాల్లో రెండు ధోరణులు ప్రస్ఫుటమవుతాయి. ఒకటి ఉదారవాదం కాగా, రెండోది సంప్రదాయ వాదం. రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్యానికి రాజకీయాలు మారిన తొలి నుంచి ఈ రెండు వాదాల మధ్య సంఘర్షణ జరుగుతూనే ఉంది. తొలినాళ్లలో ఉదారవాదులదే పైచేయిగా కనిపించింది. ఉదారవాదం పేరులో ఉన్నట్లే వీరు వివిధ వర్గాల వారి స్వేచ్ఛకు పెద్ద పీట వేస్తారు. ఎవరి ఆలోచనలనూ కాదనరు. ఒక కోణంలో చూస్తే ఈ ధోరణి బాగానే ఉంటుంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా నిన్న మొన్నటి వరకు ఉదారవాద రాజకీయులదే పైచేయిగా ఉండేది. తరతరాల నుంచి వస్తున్న ఆచార వ్యవహారాలు, విలువలను అవసరమయితే కాలానుగుణంగా, సమాజంలో వివిధ వర్గాల వారి ఆకాంక్షలకు అనుగుణంగా మార్చడానికి వారు వెనకాడరు. వలసలను ప్రోత్సహిస్తారు. అమెరికాలో డెమొక్రాట్లు, మన దేశంలో కాంగ్రెస్‌పార్టీలు ఉదారవాద రాజకీయ ప్రతినిధులుగా చెప్పుకోవచ్చు. మరోవైపు అమెరికాలో రిపబ్లికన్లు, మన దేశంలో భారతీయ జనతా పార్టీ సంప్రదాయ రాజకీయవాదానికి ప్రతినిధులుగా చెప్పుకోవచ్చు. సాధారణంగా సమాజంలో ఎక్కువ మంది ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడిచే ఉదారవాద రాజకీయాలకు మద్దతు పెరుగుతూనే ఉండాలి కానీ ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా వారికి మద్దతు పడిపోవడం మనం గమనించవచ్చు. మరోవైపు సంప్రదాయ వాదులకు మద్దతు పెరగడాన్నీ మనం చూడవచ్చు. ఉదారవాదం మరీ పెరిగిపోయి సమాజంలో అపరిమిత స్వేచ్ఛ పెరిగి క్రమబద్ధత అనేదే లేకుండా పోవడం ఉదారవాద రాజకీయాల పతనానికి ప్రధాన కారణం. కొన్ని ఉదాహరణలు గమనిస్తే ఈ పరిణామం అర్థమవుతుంది. ఐరోపాలోని ఉదారవాదులు మధ్య ప్రాచ్యం నుంచి వలసవచ్చిన వారికి ఆశ్రయం ఇచ్చే విధానాలను అనుసరించడం వల్ల అక్కడ క్రమంగా మత ఉగ్రవాదం పెరిగింది. జనాభాలో మతాల సమతౌల్యంలో మార్పువస్తోంది. ఇది స్థానికుల్లో తీవ్ర వ్యతిరేకతను పెంచి సంప్రదాయవాద రాజకీయాలకు మద్దతు పెరిగేలా చేస్తోంది. అమెరికాలో మరో రకమైన ధోరణి. ఉదారవాదులు అక్రమ వలసలను ప్రోత్సహించడం వల్ల స్థానికులకు ఉపాధి అవకాశాలు లేకుండా పోతున్నాయని ప్రజల్లో నెలకొన్న భయాందోళనలతో డెమొక్రాట్ల బలం తగ్గి రిపబ్లికన్ల బలం పెరిగింది. దాంతో సంప్రదాయ వాదాన్ని బలంగా వినిపిస్తున్న ట్రంప్ అధ్యక్షుడయ్యారు.

ప్రపంచవ్యాప్తంగా సంప్రదాయవాదుల్లో కనిపించే ఉమ్మడి లక్షణం జాతీయవాదం, తరతరాలుగా వస్తున్న ఆచార వ్యవహారాలను, విశ్వాసాలను కొనసాగించడం. ఉదాహరణకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. గర్భవిచ్ఛిత్తికి వ్యతిరేకం. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ సరోగసీకి వ్యతిరేకం. జాతీయవాదానికి వస్తే.. ప్రపంచం ఎటుపోతే మనకేమిటి? ఇతర దేశాల అంతర్గత వ్యవహారాలు మనకు అనవసరం, ముందు మాతృదేశ ప్రయోజనాలే మిన్నఅన్నధోరణి సంప్రదాయవాద నేతల్లో కనిపిస్తోంది. సంప్రదాయవాదాన్ని పరిమితంగా అయినా భుజానికెత్తుకునే నేతల సంఖ్య పెరుగుతోంది. రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వంటి వారు సంప్రదాయవాద రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు.


సమాజానికి ఉదారవాదం మంచిదా? సంప్రదాయవాదం మంచిదా అన్న ప్రశ్న వచ్చినప్పుడు ప్రజలు మధ్యేవాదాన్ని బలపర్చాలి. అంటే అతి ఎక్కడా పనికిరాదు. ఉదారవాదంలో అతి వల్ల సంప్రదాయవాదం గెలుస్తోంది. సంప్రదాయ వాదంలోని అతి వల్ల ఉదారవాదం గెలుస్తోంది. ఇదొక చక్రం. కొన్నిసార్లు ఆ వ్యవస్థది పైచేయిగా ఉంటే కొన్నిసార్లు ఈ వ్యవస్థది పైచేయిగా ఉంటోంది. ఈ రెండు వాదాల నుంచి మధ్యేవాదం ఒకటి పుట్టుకొచ్చి స్థిరపడుతుంది. అందుకు కొంత సమయం పట్టొచ్చు. రాజరిక వ్యవస్థ పోయి ప్రజాస్వామ్య వ్యవస్థ రూపుదిద్దుకోవడానికి సమయం పట్టినట్లే ఉదారవాదం, సంప్రదాయవాదాల్లోని చెడులను పక్కన పెట్టి, రెండింటిలోని మంచి ధోరణుల మేళవింపుతో కొత్త మధ్యేవాద వ్యవస్థ ఏర్పడడానికి కూడా సమయం పడుతుంది.



తుమ్మల బాల గంగాధర్ తిలక్


# కల్యాణ వైభవం...!

## హర్ష - శ్రేష్ఠ



నెల్లూరు, లెక్చరర్స్ కాలనీలోని క్లాసిక్ గ్రాఫిక్స్ అధినేత పోలంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి - లక్ష్మీప్రసన్నల కుమారుడు **వెంకట సాయి హర్షవర్ధన్‌రెడ్డి - శ్రేష్ఠ**ల వివాహం మార్చి 9వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనెలు.

## మోనిష - సహృద్



నెల్లూరు వాస్తవ్యులు కావల్‌రెడ్డి శ్రీనివాసులురెడ్డి - వేదవతిల కుమార్తె **డా. మోనిష - డా. సహృద్‌రెడ్డి** ల పరిణయం మార్చి 6వ తేదీ నెల్లూరులో ఘనంగా జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.

## యశ్వంత్ - రినిత




గుంటూరు వాస్తవ్యులు దువ్వూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి - సురేఖల కుమారుడు **యశ్వంత్ కుమార్‌రెడ్డి - సాయి రినిత** ల పెళ్లి మార్చి 6వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. నవ దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.

### ఏప్రిల్ 13న.. నెల్లూరులో ఘనంగా

# చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ అవార్డులు

- అక్షరయోధుడు ప్రసాదమూర్తికి ఫౌండేషన్ అవార్డు
- మరో ముగ్గురు సాహితీ ప్రముఖులకు విశిష్ట పురస్కారాలు



ప్రసాదమూర్తి



శ్రీనివాస్‌గౌడ్



విల్సన్‌రావు



మణిబాబు

నెల్లూరులోని ప్రముఖ సాహితీవేత్త–కవి చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ ద్వితీయ అక్షరోత్సవం సందర్భంగా, సాహిత్యంలో విశేష కృషిచేసిన సాహితీవేత్తలకు అవార్డులను ప్రదానం చేయనున్నారు. 'కలనేత' కవితా సంపుటితో అడుగులు ప్రారంభించి అసాధారణ వాక్య నిర్మాణం, నిత్య నూతన శైలీ చాతుర్యంతో ఇప్పటికి 14 కవితా సంపుటాలను తెలుగు పాఠకులకు అందించిన సుప్రసిద్ధ కవి బి.ప్రసాదమూర్తి (హైదరాబాద్)కి తమ ఫౌండేషన్ ప్రధాన అవార్డును అందజేయబోతుందని ఆ ఫౌండేషన్ ఛైర్మెన్ చిన్ని నారాయణరావు తెలిపారు. ఆయనకు ఈ అవార్డుతో పాటు, 10వేల రూపాయల నగదుతో ఘనమైన సత్కారం కూడా నిర్వహించనున్నామన్నారు. అదేవిధంగా, ప్రముఖ సాహితీవేత్త దివంగత సత్యవేటి శ్రీకాంత్, 'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు స్వర్గీయ తుంగా రాజగోపాల్‌రెడ్డి, ప్రముఖ కవి.. కీర్తిశేషులు నాగభైరవ కోటేశ్వరరావు స్మారక సాహితీ పురస్కారాలను కూడా చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ అందజేయనున్నట్లు ఆయన చెప్పారు. ఈ మూడు విశిష్ట అవార్డులకు వరుసగా ప్రముఖ సాహితీవేత్తలు పి.శ్రీనివాస్‌గౌడ్(చీరాల), కొమ్మవరపు విల్సన్‌రావు(హైదరాబాద్), అవధానుల మణిబాబు(కాకినాడ) ఎంపికయ్యారని, వీరికి సన్మానంతో పాటు, రూ.2,500 నగదు సత్కారం ఉంటుందని ఆయన తెలియజేశారు. ఏప్రిల్ 13న నెల్లూరులో జరిగే తమ ఫౌండేషన్ ద్వితీయ అక్షరోత్సవ వేడుకల్లో ఈ అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుందని, సాహిత్యాభిమానులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# కాలుష్య రహిత నగరంగా.. శ్రీసిటీ




శ్రీసిటీని పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దేందుకు శ్రీసిటీ యాజమాన్యం కృషి చేస్తోంది. తన పారిశ్రామిక భాగస్వాములతో కలిసి స్థిరమైన వనరుల వినియోగ విధానాలను శ్రీసిటీ బలోపేతం చేస్తోంది. "రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ " అనే వృత్తాకార ఆర్థిక వ్యవస్థ (సర్క్యులర్ ఎకానమీ) మూలసూత్రాల ఆధారంగా, పర్యావరణ హాని గణనీయంగా తగ్గించే చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా అన్ని నివాస, వాణిజ్య, పారిశ్రామిక ప్రాజెక్టుల నిర్మాణ పనులలో నది ఇసుక వాడకానికి ప్రత్యామ్నాయ మైన ఎం–సాండ్ (గ్రానైట్ రాళ్లను పొడిచేయడం ద్వారా తయారయ్యే ఇసుక)ను విధిగా 90 శాతం ఉపయోగించాలని, నది ఇసుక వినియోగాన్ని కేవలం 10 శాతానికి పరిమితం చేయాలని నిర్ణయించింది. ఫిల్లింగ్ కోసం, బయట మట్టిని కొనుగోలుచేయడం తగ్గించి, ఆయా ప్లాట్లలో తవ్విన మట్టినే ఉపయోగించే విధానాన్ని కూడా ప్రోత్సహించనున్నారు. దీనితోపాటు, భూ ఉపరితల పరిరక్షణతో పాటు, వర్షపు నీటి సంరక్షణ, నీటి నిల్వ సమస్యలకు తగు ఉత్తమ పరిష్కారాలు చూపనున్నారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) ఛైర్మన్ డా. పి.కృష్ణయ్యతో ఇటీవల చర్చల అనంతరం శ్రీసిటీ యాజమాన్యం ఆమేరకు పర్యావరణ హితమైన చర్యలు వేగవంతం చేస్తోంది. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి దీనిపై వ్యాఖ్యానిస్తూ, హరిత నగర లక్ష్యాన్ని సాధించే దిశగా సుస్థిర వనరుల నిర్వహణతో పాటు, పర్యావరణహిత కార్యకలాపాలను అమలు చేయడంలో శ్రీసిటీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. నూతన విధానాల అమలు ద్వారా పారిశ్రామికాభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణకు మధ్య సమతుల్యతను నెలకొల్పి, ప్రముఖ సుస్థిర పారిశ్రామిక కేంద్రమైన శ్రీసిటీ తన నిబద్ధతను చాటుకుంటోందని ఆయన వివరించారు.

# 'మెట్ట ప్రాంతానికి.. గట్టి నేత'.. కాకర్ల!

## ఉదయగిరి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు అడుగులు



జిల్లాలోని మెట్ట ప్రాంతానికి కాకర్ల సురేష్ ఓ గట్టి నేతగా ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. తన మేధాశక్తితో ఉదయగిరి అభివృద్ధికి వినూత్నరీతిలో వెలుగుబాటలు వేస్తుండడాన్ని అందరూ కొనియాడుతున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు మండలాలు ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో, వింజమూరు–కలిగిరి–జలదంకి మండలాలు కావలి డివిజన్ పరిధిలో, కొండాపురం–వరికుంటపాడు మండలాలు కందుకూరు డివిజన్ పరిధిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని జటిలమైన రెవెన్యూ సమస్యలు, ప్రజాసమస్యలను పరిష్కరించాలంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో సాధ్యం కావడం లేదు. ముగ్గురు ఆర్డీఓలను సమన్వయం చేసుకుంటే తప్ప పని జరగదు. ఆర్డీవోల ఆదేశాలు లేనిదే రెవిన్యూ సమస్యలు పరిష్కారం కావు. ఏళ్ళ తరబడిగా ఇలా పాలనాపరంగా ఉన్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఉదయగిరి నియోజకవర్గానికి ఒక రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడమే అన్ని సమస్యలకు పరిష్కార మార్గమని గ్రహించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్, వెంటనే అందుకు తగ్గట్టుగా కార్యాచరణ ప్రారంభించారు. గత అసెంబ్లీ సమావేశాలలో ఉదయగిరిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని సభా ముఖంగా కోరారు కూడా. అందుకు మంత్రి అనగాని సత్యప్రసాద్ సానుకూలంగా స్పందించడం విశేషం. ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశాలలో ప్రశ్నోత్తరాల సమయంలో ఉదయగిరిని రెవిన్యూ డివిజన్ చేసేందుకు పరిశీలనలో ఉన్నట్లు మంత్రి తెలియజేయడం సంతోషించదగ్గ పరిణామం. ఉదయగిరి రెవెన్యూ డివిజన్ ఏర్పడడం ద్వారా అన్ని శాఖల డివిజన్ అధికారులు డివిజన్ ప్రాంతంలో అందుబాటులో ఉండడం జరుగుతుంది. దాంతో, అన్ని శాఖల అభివృద్ధిని సమన్వయం చేసుకోవచ్చు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం, ఇప్పటివరకు ఎవరూ ఊహించని ఈ మార్గాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్వేషించి, అందుకు తగ్గట్టుగా అడుగులు వేస్తుండడం విశేషం.

# సావిత్రిబాయి పూలే వర్ధంతి



సంఘసంస్కర్త, దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా, నెల్లూరులోని కొండాయపాళెం నగర పాలక ప్రాథమిక పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కర్‌రావు మహిళల విద్య కోసం ఆమె చేపట్టిన కార్యక్రమాలను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు హరీష్, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

# మూగబోయిన.. మధుర స్వరం!

## అన్నమయ్య సంకీర్తనల స్వరకర్త.. బాలకృష్ణప్రసాద్ అస్తమయం!



***శ్రీవారిపై అనన్యభక్తితో ఆజన్మాంతం హరి సంకీర్తనా గానంతో తరించిన తాళ్ళపాక అన్నమాచార్యుల వారి సంకీర్తనా గానాలను గుండెనిండా నింపుకని, ఆ భక్తిగానాన్ని నేటి తరానికి అందించి భక్తలోకాన్ని పరవశింపజేసిన ప్రముఖ సంగీత విద్వాంసులు.. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆస్థాన గాయకులు గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ అస్తమించారు.***

అన్నమయ్య కీర్తనలకు స్వరాలు కట్టి, తన మధుర స్వరంతో పండిత పామరులందరినీ అలరించిన ఆ భక్తిగాయకుడి గానం.. మౌనంతో మ్రాన్పడి పోయింది. ఇక నేరుగా ఆ సంగీత సవ్వడులు మనకు వినిపించవు. భక్తిపారవశ్యంతో గానంచేసే ఆ బాలకృష్ణుని వదనం మనకు కనిపించదు. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వరుని సేవించుకుంటూ, అన్నమాచార్యులవారు శ్రీవారిపై పాడిన సంకీర్తనలను గానం చేసుకుంటూ.. తనేదో తన లోకమేదో అన్నట్లుగా ఉండే నాదయోగి.. ఇక లేకపోవడం భక్తలోకానికి తీరని విషాదమే. తిరుపతిలోని భవానినగర్‌లోని నివాసంలో ఈనెల 9న గుండెపోటుతో ఆయన తుదిశ్వాస విడిచారని తెలియడంతో స్థానికులే కాక, అనేక మంది ప్రముఖులు, తిరుమల తిరుపతి దేవస్థానాల వారు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి కడసారి కన్నీటి నివాళులర్పించారు.

**భక్తి గానంతో పరవశింపజేసిన నాదయోగి :**

1948 నవంబరు 9న రాజమండ్రిలో నరసింహారావు-కృష్ణవేణి దంపతులకు బాలకృష్ణప్రసాద్ జన్మించారు. సంగీతంపై మక్కువతో కర్నాటక సంగీతంలో డిప్లొమా చేసి, ఆలిండియా రేడియోలో ఏ-గ్రేడ్ గాయకునిగా రాణించారు. సంగీత కళానిధి నేదునూరు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అన్నమాచార్య సంకీర్తనలను గానం చేయడంలో బాలకృష్ణప్రసాద్ మంచి ప్రతిభాపాటవాలను సాధించారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయనకు అన్నమయ్య కీర్తనలంటే ప్రాణం. అందుకే, కేవలం సంగీతం సాధన చేయడమే కాక, అన్నమాచార్యుల వారి సంకీర్తనలకు అత్యద్భుతంగా స్వరకల్పన చేయడంలోనూ ఆయన తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఆ కీర్తనలకు సంగీత స్వరాలతో కూడిన పుస్తకాల ముద్రణలోనూ, సీడీ రికార్డింగ్‌లలో కూడా ఆయన తనవంతు కీలకపాత్ర పోషించారు. అన్నమయ్య సంకీర్తనలను ప్రజలందరికీ చేరువ చేయాలనే ఏకైక ధ్యేయంతో ఆయన చేసిన కృషి అపూర్వం..అనితరసాధ్యం కూడా. 1978 నుంచి 2006 వరకు తిరుమల తిరుపతి దేవస్థానాల ఆస్థాన గాయకునిగా ఉంటూ 6వందలకు పైగా అన్నమాచార్య సంకీర్తనలకు స్వరకల్పన చేశారంటే, బాలకృష్ణప్రసాద్‌కు అటు తిరుమలేశునిపై.. ఇటు అన్నమయ్యపై ఉన్న అపారమైన భక్తిప్రపత్తులే కారణం. కర్నాటక సంగీతంలో, లలిత సంగీతంలో, జానపద సంగీతంలో కూడా ఆయన ప్రతిభ అపూర్వం. 1978లో టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టులో గాయకునిగా చేరి, దాదాపు 6వేలకు పైగానే సంగీత కచేరీలు చేసి..అన్నమయ్య సాహిత్యాన్ని, సంకీర్తలను ప్రజల హృదయాల్లో ప్రతిష్ఠింపజేసి తన జీవితానికి ధన్యతను చేకూర్చుకున్నారు. భక్తి టీవీలో 'హరిసంకీర్తనం' కార్యక్రమం ద్వారా మరో వందకుపైగానే అన్నమయ్య సంకీర్తనలను భక్తలోకానికి వీనులవిందుగా సమర్పించారు. తన కృషికి గుర్తింపుగా ఎన్నో అవార్డులను, పురస్కారాలను అందుకున్నారు కూడా. ఆయన ఏర్చికూర్చిన 'అన్నమయ్య సంకీర్తనల స్వర సంపుటులు' ఆయన సంగీత ప్రతిభకే తార్కాణం. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. 76 ఏళ్ల వయోభారంతో కూడా ఆయన అన్నమయ్య కీర్తనలనే ప్రాణంగా గానం చేసేవారు. అలుపెరుగని భక్తిగాన కళాకోవిదులాయన. మృదుమధురమైన అలాంటి మహనీయుడు..మనకు దూరం కావడం బాధాకరం! ఆ గానయోగికి..నాదమునికి..'లాయర్' నివాళులు!..



**ఇటీవల (ఫిబ్రవరి 16వ తేదీ) నెల్లూరులో జరిగిన వెంకయ్యనాయుడి మనుమడు విష్ణు - సాత్వికల వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొన్న బాలకృష్ణప్రసాద్**

## టూకీగా...



### ఇందుకూరుపేటలో ధాన్యం కేంద్రాల తనిఖీ

ఇందుకూరుపేట మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసులు ఈనెల 11న తనిఖీ చేశారు. ఎక్కడా ఎలాంటి లోపం లేకుండా ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. మండల వ్యవసాయ అధికారి రఘునాథరెడ్డి, గ్రామ సహాయ అధికారులు పాల్గొన్నారు.

### ఉదయగిరిలో అంగన్‌వాడీలకు శిక్షణ

ఉదయగిరిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడురోజుల శిక్షణ ఈ నెల 11న ప్రారంభమైంది. గర్భిణుల పట్ల, చిన్నారుల సంరక్షణ పట్ల వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శుభరత్నమ్మ, రమణమ్మ అంగన్‌వాడీ కార్యకర్తలకు వివరిస్తూ శిక్షణ ఇచ్చారు.

### తోటపల్లిగూడూరులో ఆధార్ కేంద్రం పరిశీలన

తోటపల్లిగూడూరులోని గ్రామ సచివాలయంలో షెడ్యూల్ తెగలవారికి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఈనెల 11న తహశీల్దార్ టివిఎం కృష్ణప్రసాద్ పరిశీలించారు. నమోదు ప్రక్రియపై సిబ్బందికి సూచనలిచ్చారు. ఎస్టీలు ఈ ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### పెనుబల్లి హైస్కూల్‌లో సరస్వతిదేవి పూజ

పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో తమ స్కూలు విద్యార్థులు గట్టెక్కాలని కోరుకుంటూ, బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పెనుబల్లి హైస్కూల్‌లో ఈనెల 11న సరస్వతీదేవి పూజ నిర్వహించారు. అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు చేశారు. హాల్‌టికెట్లు అమ్మవారి పాదాల వద్ద ఉంచి విద్యార్థులు భక్తితో పూజలు చేయించుకున్నారు. తాము మంచి మార్కులతో ఉత్తీర్ణులమవ్వాలంటూ ప్రార్థించుకున్నారు.




సంస్మరణ

అమృతమూర్తి, ఆత్మీయదీప్తి,
మా ఇంటి దైవం, మా అమ్మ

**శ్రీమతి పూండ్ల కామేశ్వరమ్మ గారు**

(W/o లేట్ పూండ్ల చెంచురెడ్డి గారు)

తేది.18.03.2025న ఆమె 5వ వర్ధంతి సందర్భంగా
ఆ ప్రేమమూర్తిని సంస్మరించుకుంటూ...

కుమారులు :
డా॥ పూండ్ల శ్రీనివాసులురెడ్డి
పూండ్ల వెంకురెడ్డి
మరియు
కుటుంబసభ్యులు



# జీవీకే రెడ్డి దాతృత్వంతో..
# 'కస్తూరిదేవి'కి కొత్త కళ

## నెల్లూరీయులకు కానుకగా జీవీకే ఇంటర్నేషనల్ స్కూల్

- కస్తూరిదేవి వేదికగా.. సామాన్యులకి చేరువగా అంతర్జాతీయ విద్య
- 25 కోట్ల వ్యయంతో ముస్తాబవుతున్న అధునాతన విద్యా ప్రాంగణం

**నిన్నటి దాకా అబ్బా అని ఆడిపోసుకున్నవాళ్ళే ఇప్పుడు అబ్బో.. అని ఆశ్చర్యపడుతున్నారు. కస్తూరి దేవి విద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి చూసి నోరెళ్లబెడుతున్నారు. అక్కడ రూపుదిద్దుకుంటున్న జీవీకే ఇంటర్నేషనల్ స్కూలు స్వరూపాన్ని మెచ్చుకుంటూ సంబరపడిపోతున్నారు. నెల్లూరు నగర నడిబొడ్డులో కస్తూరిదేవి విద్యాలయాల ప్రాంగణంలో అవతరిస్తున్న అత్యంత అధునాతన విద్యా ఆలయాన్ని చూస్తూ మురిసిపోతున్నారు. తమ పిల్లలని అక్కడ చేర్పించ డానికి పోటీపడుతున్నారు. అడ్మిషన్లు మొదలు కాగానే క్యూలు కడుతున్నారు.**

శ్రీ కస్తూరిదేవీ విద్యాలయంపై కొంతమందికి ఉన్న అపోహలని, అనుమానాలని పటాపంచలు చేశారు 'పద్మభూషణ్' డాక్టర్ జీవీకే రెడ్డి. కస్తూరిదేవి విద్యాలయంలో ఎవరూ ఊహించని స్థాయిలో అభివృద్ధిని పట్టాలెక్కించారు. ఒక్క నెల్లూరుజిల్లాలోనే కాకుండా రాష్ట్ర విద్యారంగంలోనే తలమానికంగా నిలిచే విధంగా అత్యద్భుత విద్యా సముదాయాన్ని కస్తూరిదేవి ప్రాంగణంలో నిస్వార్థంగా నిర్మించి జిల్లా ప్రజలకి అంకితం చేయబోతున్నారు. ఆధునిక హంగులతో ఇప్పటికే 95శాతం పని జరిగిన "జీవీకే ఇంటర్నేషనల్ స్కూల్".. నిర్మాణ హంగులన్నీ పూర్తి చేసుకుని మరో నెలరోజుల్లో ప్రారంభోత్సవానికి సిద్ధం కానుంది. 2025 విద్యా సంవత్సరం నుండే విద్యార్థినులకు సేవలందించడానికి సంసిద్ధ మవుతోంది.

ఇప్పటికే నర్సరీ క్లాసు నుండి 7వ తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిసిన క్షణం నుండి విద్యార్థినుల తల్లిదండ్రులు అడ్మిషన్లకు పోటీపడుతున్నారు. తమ బిడ్డలని జీవీకే అంతర్జాతీయ పాఠశాల లాంటి విద్యా ఆలయంలో చదివించడానికి గర్వపడుతున్నాం అంటూ తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

### జీవీకే ఇంటర్నేషనల్ స్కూల్ ప్రత్యేకతలు...

ఈ 21వ శతాబ్దంలో బాలికలు అన్ని రంగాలలో దూసుకుపోవాలనే ప్రధాన లక్ష్యంతో జీవీకే ఇంటర్నేషనల్ స్కూల్ పనిచేయబోతోంది. ఇక్కడ పాఠ్యాంశాలతో పాటు ఇతర రంగాలపైన కూడా దృష్టిపెట్టి శిక్షణ అందిస్తారు. ముఖ్యంగా ఆడపిల్లల భద్రత, రక్షణపైన ప్రత్యేకశ్రద్ధ పెడతారు. వాళ్ళల్లో పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంచి సామాజిక పరిజ్ఞానాన్ని పెంపొందిస్తారు. వీటితో పాటు అన్ని రకాల క్రీడలలో తర్ఫీదు ఇస్తారు. ఈ పోటీ ప్రపంచంలో మహిళలు ఏ చోటకి వెళ్లినా తమ సమర్థత చాటగలిగేలా వాళ్ళని తీర్చిదిద్దడమే ప్రధాన ధ్యేయంగా ఈ సంస్థ పనిచేస్తుంది. ఇతర భాషలతోపాటు ముఖ్యంగా ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడగలిగేలా బాలికలకు శిక్షణ ఇస్తారు. కేవలం వారిని విద్యార్థినులుగా కాకుండా భవిష్యత్ నాయకురాళ్ళుగా తయారు చేస్తారు. 3 యకరాల విశాల ప్రత్యేక ప్రాంగణంలో 72 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 25 కోట్ల రూపాయల వ్యయంతో ఈ స్కూలు నిర్మాణం జరిగింది. మూడంతస్తులలో నిర్మించిన ఈ స్కూల్ భవనంలో ఒక్కొక్క తరగతి గది 600చదరపు అడుగులు ఉండేలా రూపకల్పన చేశారు. మొత్తం 59 గదులతో నిర్మాణం చేపట్టగా వాటిలో 27 గదులని తరగతుల కోసం వాడుకోనుండగా మిగిలిన 32 గదులను ఇతర విభాగాల కోసం వినియోగించనున్నారు.

సంపూర్ణ జ్ఞాన సంపద కలిగిన విశాలమైన గ్రంథాలయం (లైబ్రరీ), ఆధునిక పరిశోధనా పరికరాలు కలిగిన లాబొరేటరీ(ల్యాబ్), ప్రపంచ పరిజ్ఞానాన్ని అందించే కంప్యూటర్ ల్యాబ్ వంటివి ఈ ప్రాంగణంలో అందుబాటులోకి తెచ్చారు. బాలికల అభిరుచులకి తగ్గట్లుగా చదువుతో పాటు వాళ్ళకి అసక్తి ఉన్న విభాగంలో వారికి శిక్షణ ఇస్తారు. ఉదాహరణకి సంగీతం, చిత్రలేఖనం, నృత్యం, క్రీడలు వంటి రంగాలలో వారిని ప్రోత్సహిస్తారు.

మొత్తం 3 యకరాలలో 54 సెంట్లని మాత్రమే భవన నిర్మాణం కోసం వినియోగించగా, మిగిలిన 2.46 యకరాలని క్రీడా మైదానం కోసం కేటాయించారు.

### అనుభవజ్ఞుల సారధ్యంలో...



ఈ జీవీకే ఇంటర్నేషనల్ స్కూల్ నిర్వహణ కోసం సత్తా, సమర్థత, సామర్థ్యం వున్న వ్యక్తులని ఇప్పటికే నియమించారు. జిడ్డు కృష్ణమూర్తి ఆశయాలతో రిషి వ్యాలీ పాఠశాలలో తర్ఫీదు పొందిన డాక్టర్ ఉషారెడ్డిని జీవీకే ఇంటర్నేషనల్ స్కూల్స్‌కి డైరెక్టర్‌గా నియమించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలలో ప్రఖ్యాతిగాంచిన మెరిడియన్ స్కూల్స్ సీఈఓ మరియు ప్రిన్సిపాల్‌గా ఉషారెడ్డికి విద్యారంగంలో 24 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉంది. ముఖ్యంగా CBSE విద్యాలయాల నిర్వహణలో ఆమె నిపుణురాలు. వివిధ ప్రాంతాలలో సుమారు 300 CBSE పాఠశాలల నిర్వహణకి చేయూతనందించే సహోదయ సంస్థకి ఛైర్‌పర్సన్‌గా కూడా ఆమె ఉన్నారు. విద్యారంగానికి సంబంధించిన అనేక ప్రఖ్యాత సంస్థలలో ఆమె భాగస్వామి అయ్యారు.


విద్యా రంగంలో ఆమె అందించిన సేవలకి గుర్తింపుగా 40కిపైగా అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయ, అంతర్జాతీయ అవార్డులని ఆమె సాధించారు. ఉషారెడ్డి 2011, సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆనాటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ చేతులమీదుగా జాతీయ అవార్డుని కూడా అందుకున్నారు. యునైటెడ్ కింగ్డమ్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనియన్ నుండి గౌరవ ప్రొఫెసర్ బిరుదుని కూడా ఆమె కైవసం చేసుకున్నారు. సింగపూర్, శ్రీలంక దేశాలలోని విద్యాసంస్థలు ఆమెని గౌరవ పురస్కారాలతో సత్కరించాయి. ఇంతటి విశేష చరిత్ర, అశేష అనుభవం, విద్యారంగం పట్ల ఆసక్తివున్న ఉషారెడ్డి సారథ్యంలో జీవీకే ఇంటర్నేషనల్ స్కూల్ పనిచేయబోతోంది.

అంతేకాకుండా హైదరాబాదులో ప్రతిష్టాత్మక CBSE పాఠశాలలలో పనిచేసిన, డెహ్రాడూన్‌కి చెందిన కుమారి మధునెగి ఈ జీవీకే ఇంటర్నేషనల్ పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా నియమించబడ్డారు. వీరిద్దరి నేతృత్వంలో అడ్మిషన్లు జోరందుకున్నాయి. ప్రాంగణంలో అడుగుపెట్టిన అమ్మానాన్నలు తమ బిడ్డలు పలానా పాఠశాలలో చదవబోతున్నారన్న సంతృప్తిని గర్వంతో వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల ప్రారంభోత్సవానికి ముందే "ఇక్కడ సీట్లు లేవు" అనేబోర్డు పెట్టవలసి వచ్చినా ఆశ్చర్యపోనవసరం లేదన్న స్థాయిలో అడ్మిషన్లు జరుగుతున్నాయి.

శ్రీ కస్తూరిదేవి విద్యాలయం కమిటీ ఆధ్వర్యంలో జీవీకే ఇంటర్నేషనల్ స్కూల్ నడవబోతోంది. ఇదొక అద్భుతం. ఇదొక అపురూపం. ఇదొక అమోఘం. ఇప్పటిదాకా కస్తూరిదేవి సంస్థలలో జరిగింది ఓ చరిత్ర అయితే, ఇక నుండి జరగబోయేది మరో చరిత్ర...!









Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com